
ఆంధ్రజ్యోతి ****

ANDHRAJYOTHY

# నల్లగొండ


5 ఆదివారం 16 ఫిబ్రవరి 2025


**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | : 18004251442 |
| యాదాద్రి | : 1800 425 7106 |
| సూర్యాపేట | : 1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.135 | 200 | 225 |
| సూర్యాపేట | రూ.130 | 200 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5 । కనిష్ఠం 20.0

# పోదాం.. జన జాతరకు..




విద్యుత్ వెలుగుల్లో పెద్దగట్టు ఆలయం

- నేటి అర్ధరాత్రి నుంచి జాతర ప్రారంభం
- సుమారు 15లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- 2వేల మంది పోలీసులతో బందోబస్తు
- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల దారి మళ్లింపు



సూర్యాపేట నుంచి మకరతోరణాన్ని గట్టుపైకి తరలిస్తున్న యాదవులు


సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఆదివారం అర్ధరాత్రి ప్రారంభం కానుంది. జాతరకు సుమారు 15లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేయగా, అందుకు తగినట్టు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గొల్లబజార్ నుంచి మకరతోరణాన్ని యాదవ కుల సంప్రదాయాల ప్రకారం శోభాయాత్రగా పెద్దగట్టుకు చేర్చారు. దిష్టిపూజ తర్వాత కేసారం గ్రామంలోని మెంతబోయిన కుటుంబాల ఆధ్వర్యంలో 15 రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న దేవరపెట్టె ఆదివారం అర్ధరాత్రి గుట్టపైకి చేరుకుంటుంది. దీంతో జాతర ప్రారంభమవుతుంది. జాతర ప్రారంభమైన తర్వాత భక్తులు బోనాలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పిస్తారు. గంపల ప్రదర్శన తర్వాత సౌడమ్మ అమ్మవారికి తల్లి గొర్రెను, పిల్ల గొర్రెను బలిచ్చి బలిచల్లుతారు. జాతర సందర్భంగా 2వేల మంది పోలీసులతో భద్రత ఏర్పాటుచేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట కలెక్టరేట్)


•7లో..


## స్వర్ణ విమానగోపురానికి
# మహాకుంభాభిషేకం



- 23న మహాక్రతువు
- 19 నుంచి ప్రారంభంకానున్న ప్రత్యేక పూజలు
- 108మంది రుత్వికులు, రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు



దివ్య విమాన గోపురానికి తొలగనున్న ముసుగు

తెలంగాణ తిరుపతిగా పేరొందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వర్ణ విమాన గోపురానికి మహాకుంభ సంప్రోక్షణకు ముహూర్తం ఖరారైంది. దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వర్ణ గోపురం సంప్రోక్షణా కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 50.5అడుగుల ఎత్తుతో ఉండే దివ్య విమాన పంచతల గోపురానికి



సిద్ధమైన యాగశాల

సుమారు 68.84కిలోల బంగారంతో తాపడం చేశారు. ఈ నెల 23న ఉదయం 11.54గంటలకు మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన సుదర్శన లక్ష్మీ నారసింహ దివ్య స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను వానమామలై మఠం పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 108 మంది రుత్వికులు, ఆలయ అర్చకులు నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతితో ప్రొటోకాల్ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్టు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా, మహాకుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఈ నెల 19 నుంచి 23 వరకు సుదర్శన హోమాలతోపాటు, 23న హోమం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణోత్సవాలు రద్దు చేశారు. సహస్ర నామార్చనలు, అభిషేకాలు యథావిధిగా కొనసాగనున్నాయి.


•6లో..


## డీఎస్సీ 2008 అభ్యర్థులకు
# పోస్టింగ్‌లు

**జిల్లాలో 75 మందికి ఆర్డర్‌లు ఇచ్చిన విద్యాశాఖ**

**సోమవారం విధుల్లో చేరాలని ఆదేశాలు**

నల్లగొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ 2008 అభ్యర్థులకు శనివారం కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టింగ్ ఇచ్చారు. మొత్తం 75 మందికి జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి ఆర్డర్‌లను అభ్యర్థులకు అందించారు. సోమవారం వారంతా విధుల్లో చేరాలని ఆదేశాలిచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీ 2008 అభ్యర్థులకు పోస్టింగ్‌లు కల్పించారు. కౌన్సిలింగ్ ద్వారా పోస్టులను భర్తీ చేశారు. వివరాల్లోకి వెళితే డీఎస్సీలో ఎంపిక విధానాన్ని మార్చడంతో తమకు అన్యాయం జరిగిందని ఎస్జీటీగా రావాల్సిన ఉద్యోగాలు రాలేదంటూ డీఎస్సీ 2008 అభ్యర్థులు గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ కాలం తర్వాత సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతోపాటు తాత్కాలిక ఉద్యోగులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో జిల్లాలో 75మంది అర్హత కలిగిన అభ్యర్థులకు అవకాశం కల్పించారు. వీరికి కనీస వేతనం రూ.31,040గా ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా వీరికి కాంట్రాక్ట్ ఉద్యోగుల మాదిరిగానే సెలవులు ఇవ్వనున్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 2008 డీఎస్సీ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు పరిశీలించారు. అనంతరం నోటిఫైడ్ చేసిన ఖాళీల్లో అభ్యర్థులు ర్యాంకుల ఆధారంగా పోస్టింగ్ ఆర్డర్‌లు జారీ చేశారు.

# రేవంత్‌ది అబద్ధాల ప్రభుత్వం

- అసత్యాలతోనే పరిపాలన
- జాబ్ క్యాలెండర్ ఎటు పోయింది
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మీద పదేళ్లకు వ్యతిరేకత వస్తే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ పాలన మీద ఏడాదికే వ్యతిరేకత మొదలైందని కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డి గెలుపు కోరుతూ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం అబద్ధాలతోనే రేవంత్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, అందుకే ఏడాదిలోపే ప్రజల్లో అపఖ్యాతి మూటగట్టుకున్నారన్నారు. కుల గణన సర్వేతో బీసీలకు అన్యాయం జరిగిందని, తాము ప్రశ్నిస్తే, దానికి సమాధానం చెప్పకుండా మోదీ కులం ప్రస్తావన తీసుకురావడం ఏమిటని నిలదీశారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ పేరుతో ఇచ్చిన హామీని ఇంకా అమలు చేయలేదన్నారు. తేదీలవారీగా ఏ రోజు ఏ గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తాం అని జాబ్ క్యాలెండర్ విడుదల చేసి సంవత్సరం పూర్తవుతుందని, జాబ్ క్యాలెండర్ ఎటు పోయిందని నిలదీశారు. నిరుద్యోగులను రేవంత్ నట్టేట ముంచారని మండిపడ్డారు. సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి, గొంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, కంకణాల శ్రీధర్‌రెడ్డి, కంకణాల నివేదిత, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూధన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పిల్లిరామరాజు, కన్మంతరెడ్డి శ్రీదేవి, నీరజ, రావెళ్ల కాశమ్మ, తారాసింగ్ పాల్గొన్నారు.

## మహిళా దొంగల ముఠా అరెస్ట్


•6లో..


## ఏపీ నుంచి వచ్చే కోళ్ల వాహనాలు వెనక్కి




# ఎవరూ అపోహలకు గురికావొద్దు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మృతి చెందిన కోళ్ల కళేబరాల ఘటన పట్ల ప్రజలు ఎవరూ అపోహలకు గురికావద్దని నల్లగొండ కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శనివారం ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, జలమండలి, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, వెటర్నరీ అధికారులతో కలిసి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మృతిచెందిన కోళ్లను వేశారని సమాచారం వచ్చిన వెంటనే జలమండలి, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, వెటర్నరీ తరఫున సమగ్ర విచారణ జరిపామన్నారు. తమ విచారణలో రిజర్వాయర్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో నివసిస్తున్న పౌల్ట్రీ యజమాని చనిపోయిన 45 కోళ్లను లింక్ కెనాల్‌లో విసిరి వేశారని, ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఏఎస్పీ మౌనిక అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. ఆమె వెంట ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ డీఈ నాగయ్య, వెటర్నరీ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, పలువురు అధికారులు ఉన్నారు.




# గంజాయి రహిత జిల్లాగా నిర్మిస్తాం


**ఎస్పీ శరత్ చంద్ర పవార్**



ప్రథమ బహుమతిని అందజేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాగా నల్లగొండను నిర్మిస్తామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన యువతేజం జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్పీ హాజరై గెలుపొందిన జట్లకు షీల్డులు, నగదు బహుమతులను అందజేసి మాట్లాడారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా మిషన్ పరివర్తన్ రూపొందించి ఎంతో మంది యువతలో మార్పు తెచ్చామని, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో యువతేజం కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వచ్చే ఏడాది కూడా ఈ పోటీలు నిర్వహిస్తామని, ఈ పోటీలలో ఖచ్చితంగా పోలీస్ టీమ్ ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచే కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన మిర్యాలగూడ సబ్ డివిజన్ జట్టుకు షీల్డుతోపాటు రూ.25వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన నల్లగొండ సబ్ డివిజన్(శాలిగౌరారం) జట్టుకు షీల్డుతో పాటు రూ. 15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన దేవరకొండ డివిజన్‌కు షీల్డు రూ.10వేల నగదును అందజేశారు. అదే విధంగా బెస్ట్ ఆల్‌రౌండర్‌గా సాయికిరణ్(మిర్యాలగూడ), బెస్ట్ రైడర్ శివ( దేవరకొండ), బెస్ట్ డిఫెండర్‌గా వినయ్(మిర్యాలగూడ) నిలిచారు. జిల్లాస్థాయి పోటీలు రసవత్తరంగా హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, విఠల్‌రెడ్డి, రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి**


దేవరకొండ సీపీఐ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

దేవరకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ సీపీఐ భవన్‌లో జరిగిన దేవరకొండ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని గ్రామాలు తిరిగి సీపీఐ నాయకులు, కార్యకర్తలు కొత్త శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంకావాలన్నారు. ఈ నెల 20 నుంచి జరగనున్న సీపీఐ గ్రామశాఖ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు వలమాల ఆంజనేయులు, వెంకట్రాములు, మైనొద్దిన్, యాదయ్య, జ్యోతిబసు, కందుకూరు శ్రీను పాల్గొన్నారు.



# 19 నుంచి మహాక్రతువు

- ఐదు రోజుల పాటు మహాకుంభాభిషేకం
- 108 మంది రుత్వికులు
- మూలమంత్ర హవనాలు, జపాలు
- 23న మహాకుంభాభిషేకం



దివ్య విమాన రాజగోపురం ప్రారంభానికి ఏర్పాట్లు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో మహాక్రతువు ఈ నెల 19 నుంచి మొదలుకానుంది. హోమాలు, జపాలు, హవనాలు, వేదాలు, పారాయణాలతో ఆధ్యాత్మికత ఉట్టిపడనుంది. ఉదయం 11.54 గంటలకు మహాకుంభ సంప్రోక్షణతో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల వేళ దివ్య విమాన బంగారు(గాలి) గోపురం దర్శించుకునే భాగ్యం కలుగనుంది. దేశంలోనే 50.5అడుగుల ఎత్తయిన పంచతల గోపురంపై 10,753.39 చదరుపు అడుగుల బంగారు తొడుగుల కోసం సుమారు 68.84కిలోల బంగారం వినియోగించారు. ఎన్నికల కోడ్ కొనసాగుతున్న నేపథ్యంలో ఎన్నికల కమిషనర్ ప్రత్యేక అనుమతితో ఈ మహాక్రతువును సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

### కళావరోహణ నుంచి కళారోహణ

2024 నవంబరు 6న కళావరోహణ చేసిన స్థానిక ఆచార్యులు, పూజారులు బంగారు తాపడం పనులు శనివారంతో ముగిశాయి. ఈ నెల 19 ప్రారంభమై 23వ తేదీ వరకు జరిగే వేడుకలు వానమామలై మధుర పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో కళారోహణ ప్రక్రియ పూర్తి కానుంది. ఈ సందర్భంగా ప్రత్యేకపూజలను ఆలయ ప్రధానార్చకులు లక్ష్మీనరసింహచార్యులు, కాండూరి వెంకటాచార్యులు సారథ్యంలో అర్చక, రుత్విక బృందం ఆలయ ఉత్తర తిరువీధిలో ఏర్పాటుచేసిన హోమగుండాల్లో ప్రారంభించనున్నారు.

### 19 నుంచి మొదలై

క్రతువులో తొలిరోజైన 19న ఆలయంలోని ఆస్థాన మండపంలో ఉదయం 7.45 గంటలకు మహాకుంభాభిషేకం దిగ్విజయం చేసేందుకు విష్వక్సేన ఆరాధన జరిపిస్తారు. వివిధ మంత్రాల పఠనం గావిస్తూ సముద్రాలు, నదులను అవాహన చేస్తూ యజ్ఞకుండాలు, ఆలయ తిరువీధులు సంప్రోక్షణ చేసి పుణ్యహావాచనం గావిస్తారు. స్వామివారికి కంకణధారణ చేసి యాగం పాల్గొనే వేద పారాయణికులు, రుత్వికులకు దీక్షా వస్త్రాలు అందజేస్తారు. యాగశాలలో మృత్సంగ్రహణం చేసి ఈశాన్యంలో నవధాన్యాలతో లక్ష్మీదేవిని ఆహ్వానించి అంకురార్పణ చేస్తారు. ఆలయ ఉత్తర తిరువీధిలో 36/36 ఫీట్ల విస్తీర్ణంలో తూర్పు వాసుదేవ కుండం, దక్షిణాన ప్రద్యున్న, పశ్చిమాన సంకర్షణ, ఉత్తరాన అనురుద్ద కుండం, ఈశాన్యంలో మహాలక్ష్మీకుండంతో ఐదు హోమగుండాలు ఏర్పాటుచేశారు. వీటిలో అగ్నిమథనం చేసి నారసింహ, సుదర్శన, గరుత్మంతుడి, లక్ష్మీదేవి మంత్రాలు, దివ్య విమాన రాజగోపురం(బంగారుమయం)లోని దేవతలకు అవిశ్సులు అందజేస్తారు.

హోమగుండాల మధ్యలో స్వామివారిని ఆవాహన చేసి ప్రతిష్ఠించి యజుర్వేదాలు ఆలపించేందుకు 108 మంది రుత్వికులతో పాటు అదనంగా వంట స్వాములు 15 మందిని ఆహ్వానించారు. ఈ నెల 22 వరకు 60మంది రుత్వికులు లక్ష్మీ, నరసింహ, సుదర్శన, రామాయణం, భాగవతం, మూల మంత్ర హవనాలు, మూల మంత్ర జపాలతో పాటు ఉదయం సాయంత్రం విష్ణు, నరసింహ, రామాయణం, భాగవత పారాయణాలతో పాటు అభిషేకాలు నిర్వహిస్తారు. చివరి రోజు ముందుగా దిష్టికుంభం, నైవేద్యం, గుమ్మడికాయ, కొబ్బరికాయ సమర్పించి యాగశాలలో ఏర్పాటు చేసిన మహా కుంభాభిషేకం కలశంతో దివ్య విమాన రాజగోపురం వానమామలై మధుర పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో పంచకుండాత్మక మహాయాగం నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు నిర్విఘ్నంగా హోమాలు, జపాలు, అభిషేకాలు చేపట్టిన రుత్వికులు, పారాయణికులు, యాజ్ఞికులు నాలుగు గంటల పాటు శాంతి కల్యాణం నిర్వహిస్తారు. దేశ, రాష్ట్ర నలుమూలల నుంచి ఈ మహాక్రతువులో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని ఈవో ఏ. భాస్కర్‌రావు పిలుపునిచ్చారు.

### ఆర్జిత సేవలు రద్దు

మహాకుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఈ నెల 19 నుంచి 23 వరకు కేవలం సుదర్శన హోమం, 23న సుదర్శన హోమం, సువర్ణ పుష్పార్చన, నిత్య కల్యాణోత్సవాలు రద్దు చేశారు. కాగా సహస్ర నామార్చనలు, అభిషేకాలు యథావిధిగా కొనసాగుతాయి.



### వైభవంగా మహాకుంభాభిషేకం



స్వర్ణమయంగా దివ్య విమాన రాజగోపురం మారేందుకు గడియలు దగ్గరపతున్నాయి. ఈ మహాక్రతువును 19న ప్రారంభించి 23వరకు వానమామలై మధుర పీఠాధిపతి రామానుజజీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో వైభవంగా నిర్వహించనున్నాం. 108మంది రుత్వికులకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి. హోమాలు, జపాలు, మంత్ర పఠనాలతో గోపురం బంగారుమయం కానుంది.

కాండూరి వెంకటాచార్యులు, ప్రధానార్చకుడు, యాదగిరిగుట్ట, దేవస్థానం

### రోజు వారీ పూజా కార్యక్రమాలు

**19న ఉదయం:** స్వస్తివాచనం, విష్వక్సేనరాధన, రక్షాబంధనం, యాగశాల ప్రవేశం, మృత్యంగ్రహణం, సంధ్యాంకురార్పణ, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, ఇతర పూజా కార్యక్రమాలు

**సాయంత్రం:** ద్వారాది కుంభార్చన, బింబ, కుంభ, మండల, వారుణానువాక హోమం, జలాధివాసం, ఇతర పూజా కార్యక్రమాలు

**20న ఉదయం :** వేద ఇతిహాసాది పురాణ స్తోత్ర పారాయణం, ఇతర పూజా కార్యక్రమాలు

**సాయంత్రం :** ఛాయాధివాసం, వారుణానువాక హోమం, ఇతర పూజా కార్యక్రమాలు

**21న ఉదయం :** చతుస్థానార్చన, విమాన దిగ్దేవతా విశేషహోమాలు,పంచ వింశతి కలశ స్నపనం

**సాయంత్రం :** ద్వారాది కుంభార్చన, చతుస్థానార్చనలు, ధాన్యాధివాసం, ఇతర పూజలు

**22న ఉదయం :** విమాన అధిష్ఠాన పరివార విశేష హోమాలు, ఏకాశితి కలశ స్నపనం,

**సాయంత్రం:** అగ్ని ఆరాధనలు, జీవన్యాస, తత్వన్యాస, కళన్యాస, ప్రాణప్రతిష్ఠ హోమాలు, శయ్యాధివాసం, ఫలపుష్పాధివాసం

**చివరి రోజు ప్రత్యేకం**

23న ఉదయం 9గంటలకు మహాపూర్ణాహుతి, వేద శాత్తుముఱై, 11.54గంటలకు మూలనక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరాంశ సుముహూర్తాన దివ్య బంగారు గోపురం మహాకుంభాభిషేక సంప్రోక్షణ మహోత్సవం, మహా రాజభోగ నివేదన, పెరియ శాత్తుముఱై, సాయంత్రం 4గంటలకు ఆస్థాన మండపంలో శాంతి కల్యాణం నిర్వహిస్తారు.

### యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు జరిగాయి. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీదళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్ర రీతిలో వైభవంగా చేపట్టారు. అదేవిధంగా అష్టభుజి ప్రాకార మండపంలో స్వామి అమ్మవార్లను అలంకరించి సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడికి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం, సాయంత్రం అలంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వైభవంగా నిర్వహించారు. శివాలయంలో రామలింగేశ్వరస్వామికి, మహామడపంలో స్పటికమూర్తులకు నిత్యారాధనలు, యాగశాలలో నిత్యరుద్రహవన పూజలు కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధవిభాగాల ద్వారా రూ.30,92,733 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు. కాగా, సంగీత సభల్లో భాగంగా నాగగిరిజా కుమారి బృందం భక్తిసంగీతం భక్తులను ఆకట్టుకుంది.

### 17న తిరుమంజన సేవ

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆలయ తిరుమంజన సేవోత్సవం నిర్వహిస్తున్నట్లు ఈవో భాస్కర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17న మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 3.30గంటల వరకు భక్తులకు దర్శనాలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఈ నెల 19 నుంచి 23 వరకు ఆర్జిత సేవలు రద్దు చేయగా సహస్రనామార్చన, అభిషేకాలు యథావిధిగా కొనసాగనున్నట్లు మరో ప్రకటనలో ఈవో పేర్కొన్నారు.

## విశ్వవ్యాప్తమయ్యేలా మహాకుంభాభిషేకం

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : బంగారుమయమైన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ దివ్య విమాన రాజగోపురాన్ని వీక్షించేందుకు భక్తలోకం ఎదురుచూస్తోందని ఆలయ ఈవో ఏ భాస్కర్‌రావు అన్నారు. యాదగిరికొండపై ప్రధాన కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు విశ్వవ్యాప్తమయ్యేలా మహాకుంభిషేకాన్ని నిర్వహిస్తామన్నారు. 50ఏళ్ల పాటు మన్నికగా ఉండేలా బంగారు తాపడం పనులు సాగాయన్నారు. 24క్యారెట్ల బంగారంతో చేసిన తొడుగులకు ఒక చదరపు అడుగుకు ఆరు గ్రాముల బంగారం వినియోగించగా 11,753.39 చదరపు అడుగులకు 65.84కిలోల బంగారం అవసరమైందన్నారు. 50.5ఫీట్ల ఎత్తు ఒక అంతస్థుకు ఎనిమిది విగ్రహాల చొప్పున ఐదు అంతస్థులుగా ఉన్న గాలిగోపురంపై 40విష్ణు మూర్తి, గరుడ ఇతర రూపాలతో పాటు గోపురం చుట్టూ 113 ప్రతిమలను బిగించారన్నారు. తొడుగుల తయారీకి మొత్తం రూ. 5.50 కోట్లు ఖర్చయ్యిందన్నారు. ఈ నెల 17 వరకు గోపుర పరిసరాలు శుభ్రపర్చే పనులు పూర్తవుతాయన్నారు. కుంభాభిషేకం సమయంలో 150కిలోమీటర్ల వేగంతో గాలివీచినా ఎలాంటి ప్రమాదం జరుగకుండా ఏర్పా ట్లుచేశామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ప్రోటోకాల్ ప్రకారం సీఎం, డిప్యూటీ సీఎం, మం త్రులు, యాదాద్రి జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలను ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. మహాకుంభాభిషేకానికి రూ.లక్ష వరకు విరాళం సమర్పించిన దాతలను ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రత్యేక గ్యాలరీలు, భక్తులు వీక్షించేందుకు 12 ఎల్‌ఈడీ స్ర్కీన్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 23న ఉదయం బ్రేక్ దర్శనం, సువర్ణ పుష్పార్చన రద్దు పర్చి, 11 నుంచి ఒంటిగంటవరకు దర్శనాల నిలివేస్తామన్నారు. ఐదు రోజుల పాటు నిర్వహించే కార్యక్రమంలో 2వేల మందికి అన్నదానం చేయనున్నట్లు, కొండకింద అన్నదాన సత్రంలో 800మంది భక్తులు ఒకేసారి భోజనం చేసేలా తీర్చిదిద్దామన్నారు. అదేవిధంగా మార్చి 1 నుంచి 11 వరకు జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల వైభవం పెంచేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు గొప్పగా నిర్వహించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులను ఆహ్వానించామన్నారు. మహా కుంభాభిషేకం నిర్వహణకు రూ.13కోట్లు ప్రతిపాదించగా స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఉన్నంతలో వైభవంగా జరపాలని నిర్ణయించామన్నారు. సమావేశంలో అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, డీఈవో భాస్కరశర్మ, ప్రధానార్చకులు నల్లంథీగల్ లక్ష్మీనరసింహచార్యులు, వెంకటాచార్యులు, ఏఈవోలు రమేష్‌బాబు, నవీన్‌కుమార్‌శర్మ, ఉపప్రధానార్చకుడు సురేంద్రాచార్యులు పాల్గొన్నారు.



ఈవో భాస్కర్‌రావు

## ఏపీ నుంచి వచ్చే కోళ్ల రవాణా వాహనాలు వెనక్కి

కోదాడ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి తెలంగాణకు వస్తున్న 8 కోళ్ల దాణా రవాణా వాహనాలు, 17,000 కోడిపిల్లలను తరలిస్తున్న వాహనాలను వెనక్కి పంపినట్లు చెక్‌పోస్ట్ సూపర్‌విజన్ ఆఫీసర్, ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పీ పెంటయ్య తెలిపారు. కోదాడ మండలం రామాపురంలో స్థానిక పోలీసులతో కలిసి పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఏర్పాటుచేసిన చెక్‌పోస్టును ఆయన పరిశీలించారు. చెక్‌పోస్టులో అనంతగిరి, కోదాడ మండలాలకు చెందిన పశువైద్యాధికారులు, సిబ్బంది 24 గంటల పాటు తనిఖీలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ సోకకుండా కలెక్టర్, పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ప్రతీ వాహనాన్ని తనిఖీ చేస్తున్నామన్నారు. జిల్లాలోని కోళ్లఫాం యజమానులకు సూచనలు అందజేయడంతో నిత్యం పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎవరూ బర్డ్ ఫ్లూ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తనిఖీ సందర్భంగా పశువైద్యాధికారులు సురేందర్, శ్రీనివాస్, సిబ్బంది, శరత్, పవన్ పాల్గొన్నారు.

## పంటలను ఎండబెడుతున్న పాలకులు



చిట్యాలలో ఎమ్మెల్సీ కవితకు గొర్రెపిల్లను అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆదిమల్లయ్య, పక్కన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నిన్న మొన్నటి వరకు పచ్చని పంట పొలాలతో ఉన్న తెలంగాణను నీళ్లివ్వకుండా పాలకులు ఎండబెడుతున్నారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న బీసీ రౌండ్‌టేబుల్ సమావేశానికి వెళ్తున్న ఆమెకు శనివారం నల్లగొండ జిల్లా చిట్యాలలో నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ రైతు రుణమాఫీ, రైతుభరోసా పథకాలను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. యూరియా బస్తా కోసం మళ్లీ క్యూలైన్లు కట్టే పరిస్థితి నెలకొందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ముందున్న నకిరేకల్ నియోజకవర్గ బీఆర్ఎస్ కార్యకర్తలు గుండె ధైర్యంతో ఉండాలని, పార్టీ వారికి అండగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మార్కెట్ మాజీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య కవితకు గొర్రె పిల్లను బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్య, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ కూరెల్ల లింగస్వామి, మాజీ ఎంపీపీలు కొలను సునీతావెంకటేష్, కన్నెబోయిన జ్యోతిబలరాం, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ మెండె సైదులు, చిత్రగంటి ప్రవీణ్, ఆగు అశోక్, కోనేటి ఎల్లయ్య పాల్గొన్నారు.

### ఆర్ఆర్ఆర్ బాధితులకు న్యాయం చేయాలి

చౌటుప్పల్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ఆర్ఆర్ఆర్ బాధితులకు న్యాయం చేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. శనివారం ఖమ్మంలో జరిగే బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి వెళ్తున్న కవితకు యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం వద్ద మునుగోడు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఆర్ఆర్ఆర్ బాధితులకు అండగా ఉంటానని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు. ఆర్ఆర్ఆర్ బాధితులు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు గడుస్తున్నా ఆర్ఆర్ఆర్ బాధితుల సమస్యలను పట్టించుకోకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారన్నారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఆర్ఆర్ఆర్ బాధితుల పక్షాన చొరవ తీసుకుని ప్రభుత్వంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కార్యకర్తలు పోరాటాలు నిర్వహించాలన్నారు. ప్రజల పక్షాన బీఆర్ఎస్ నిరంతరం పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ చౌటుప్పల్ మండల అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, నేతలు చింతల దామోదర్ రెడ్డి, శివశంకర్, సుర్వి యాదయ్య గౌడ్, బి శ్రీనివాస్ రెడ్డి, మల్లేశ్ గౌడ్, చిన్నం బాలరాజు, మాచర్ల కృష్ణ పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠా అరెస్ట్

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : రద్దీగా ఉండే ప్రాంతాలలో ప్రజలను మభ్యపెట్టి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు యాదాద్రి జోన్ డీసీపీ ఎం రాజేష్‌చంద్ర తెలిపారు. శనివారం యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. సమీప బంధువులైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ మండలం రామవరపుపాడు గ్రామానికి చెందిన దంపతులు గండికోట యోహన్, దుర్గా, అదే గ్రామానికి చెందిన నక్క మంగా, పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలం చింతల కోటిగరువు గ్రామానికి చెందిన గండికోట లక్ష్మి ముఠాగా ఏర్పడ్డారు. తెలుగు రాష్ట్రాల్లో బస్టాండ్లు, బ్యాంకులు తదితర రద్దీగా ఉండే ప్రాంతాల్లో ప్రజలను మభ్యపెడుతూ చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో జనవరి 11న భువనగిరి బస్టాండ్‌లో బస్సు దిగిన ఓ మహిళ ప్రయాణికురాలిని మభ్యపెట్టి ఆమె బ్యాగులోని ఐదు తులాల బంగారు ఆభరణాలు, రూ.5 వేల నగదు అపహరించి, పారిపోయారు. కొద్దిసేపటికి ఆమె పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్ఐ కుమారస్వామి కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ కే సురేష్‌కుమార్ పర్యవేక్షణలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం భువనగిరి బస్టాండ్‌లో మరోమారు చోరీ చేసేందుకు నలుగురు కారులో వచ్చారు. యోహన్ కారులో బస్టాండ్ వెలుపలే ఉండగా ముగ్గురు మహిళా దొంగలు బస్టాండ్‌లో అనుమానాస్పద స్థితిలో పోలీసులకు కనిపించారు. వారి బ్యాగులను తనిఖీలు చేయగా బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో అదుపులోకి తీసుకొని విచారించగా జనవరి 11న బస్టాండ్‌లో చోరీ చేసిన ముఠాగా తేలడంతో పాటు మరోమారు చోరీ చేసేందుకు వచ్చినట్టు నిర్ధారణ అయింది.

అయితే బస్టాండ్ వెలుపల కారులో ఉన్న యోహన్ పోలీసులు రాకను పసిగట్టి పరారయ్యాడు. కాగా మహిళా దొంగలను విచారించగా జనవరి 13న కోరుట్ల బస్టాండ్‌లో చోరీ చేసినట్లు తెలిపారు. అలాగే ఈ ముఠాపై మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రూ.20 వేల నగదు, విశాఖపట్నం గాజువాకలో ఆటో ప్రయాణికురాలి నుంచి నాలుగు తులాల బంగారు ఆభరణాలు కాజేసిన కేసులు ఉన్నాయి. అంతేకాక యోహన్, దుర్గా దంపతులు, మంగపై గతంలో పలు జిల్లాలో వేరువేరుగా చేసిన దొంగతనాల కేసులలో రెండు పర్యాయాలు జైలు శిక్ష కూడా అనుభవించినట్లు తేలింది. ఈ మేరకు ముగ్గురు మహిళా దొంగలను అరెస్టు చేసి రూ. 3.40 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, 20వేల నగదు స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచారు. న్యాయమూర్తి ఆదేశాల మేరకు చర్లపల్లి జైలు రిమాండ్‌కు తరలించారు. సమావేశంలో ఏసీపీ కె రాహుల్‌రెడ్డి ఉన్నారు.

### స్టేషన్ నుంచి పారిపోయిన పురుష దొంగ?

అంతర్రాష్ట్ర మహిళా దొంగల ముఠాలో కీలకంగా భావిస్తున్న ఓ పురుష దొంగ భువనగిరి పోలీస్‌స్టేషన్ నుంచి పారిపోయినట్టు ప్రచారం అవుతోంది. శుక్రవారమే పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు. ఈ క్రమంలో శనివారం తెల్లవారుజామున పురుష దొంగ పారిపోయినట్టు ప్రచారం జరిగింది. అయితే స్టేషన్ నుంచి ఎవరూ పారిపోలేదని, ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించి తామే వదిలేశామని డీసీపీ రాజేష్‌చంద్ర మీడియా సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు తెలిపారు.

### సూర్యాపేటలో దొంగతనం

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఓ ఇంట్లో చోరీ విషయం శనివారం వెలుగుచూసింది. బాధితుడు ముదిగొండ వీరస్వామి తెలిపిన వివరాల ప్రకారం పెన్‌పహాడ్ మండలం అన్నారంగ్రామానికి చెందిన వీరస్వామి కుమారుడు నరేష్, ఎస్‌పీజీ విభాగంలో ఢిల్లీలో విధులు నిర్వహిస్తున్నాడు. నరేష్ సూర్యాపేటలోని గిరినగర్‌లో సొంత ఇంటిని నిర్మించుకుని విధులకు సెలవులు ఉన్నప్పుడు సూర్యాపేటకు వచ్చి ఆ ఇంట్లోనే ఉంటుంటాడు. అయితే మూడు నెలల క్రితం ఇంటికి తాళం వేసి విధులకు హాజరయ్యేందుకు ఢిల్లీకి వెళ్లాడు. శనివారం ఉదయం ఇంట్లోని కిందిభాగంలో అద్దెకు ఉండే వారు మొదటి అంతస్తుకు వెళ్లి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించారు. ఈ విషయమై నరేష్‌కు సమాచారం ఇవ్వగా ఆయన తండ్రి వీరస్వామికి తెలిపాడు. వీరస్వామి వెళ్లి చూడగా 5తులాల బంగారం, 100 తులాల వెండి ఆభరణాలు కనిపించలేదు. దీంతో ఈ ఘటనపై వీరస్వామి పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశాడు.

### మహిళ మెడలో బంగారు గొలుసు ..

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : నడుచుకుంటూ వెళ్తున్న మహిళను మాటల్లోపెట్టి మెడలో బంగారు గొలుసును దుండగులు చోరీ చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల శివారులో శనివారం జరిగింది. చోరీకి గురైన గొలుసు విలువ సుమారు 2 తులాలు ఉంటుందని తెలిసింది. ఈ సంఘటనకు సంబంధించి గ్రామస్థుల ద్వారా తెలిసిన వివరాలు ఇలా ఉన్నాయి. బీ.వెల్లెంలకు చెందిన నిమ్మలి యాదమ్మ నార్కట్‌పల్లి దారి వైపు ఉన్న వ్యవసాయబావి వద్దకు ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. అటుగా బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు యాదమ్మను పలకరించారు. ఆ సమయంలో ఆ దారి గుండా ఎవరూ రావటం లేదని నిర్ధారించుకుని మహిళ మెడలో బంగారు గొలుసును లాక్కుని మునుగోడు రోడ్డు వైపు పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు గ్రామస్తులకు సమాచారం ఇచ్చింది. దీంతో బైక్‌పై వెళ్తున్న దుండగులను పట్టుకునేందుకు నార్కట్‌పల్లి, మునుగోడు, నల్లగొండ రూరల్ పోలీసులు విఫల యత్నం చేశారు.

### బ్యాటరీ దొంగల అరెస్ట్, కేసు నమోదు

కేతేపల్లి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జల్సాల కోసం నల్లగొండ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వాహనాల బ్యాటరీలను దొంగిలిస్తున్న ఇరువురిని శనివారం నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులు అరెస్టుచేశారు. పట్టుబడిన వారి నుంచి రూ.2.94లక్షల విలువైన 33బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నారు. శనివారం ఎస్ఐ శివతేజగౌడ్ విలేకరులకు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నకిరేకల్ మండలం పాలెం గ్రామానికి చెందిన మోదాల విష్ణు మిర్యాలగూడలోని విద్యానగర్‌లో ఉంటూ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో మిర్యాలగూడ మండలంలోని తుంగపహాడ్‌కు చెందిన ఖమ్మంపాటి మధుకు విష్ణుతో స్నేహం కుదిరింది. ఇరువురూ తాగుడుకు బానిసలై జల్సాలకు అలవాటుపడ్డారు. తమ అవసరాలకు సరిపడా డబ్బును సులభంగా సంపాదించుకోవడానికి ఐదారు నెలలుగా నకిరేకల్, తిప్పర్తి, కేతేపల్లి, మాడ్గులపల్లి మండలాలకు చెందిన వివిధగ్రామాల్లో నిలిపి ఉంచిన ట్రాక్టర్లు, టిప్పర్లు, లారీల బ్యాటరీలను దొంగిలించారు. నిందితుల్లో ఒకరైన మోదాల విష్ణు స్వగ్రామం పాలెంలోని నివాసంలో భద్రపరిచిన 33బ్యాటరీలను విక్రయించడానికి శనివారం ఆటోలో వేసుకుని సూర్యాపేట వైపునకు వెళ్తున్నారు. ఇదే సమయంలో కొర్లపహాడ్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న కేతేపల్లి పోలీసులను చూసి ఆటోలో ఉన్న నిందితులు ఆటోను వేగంగా ముందుకు నడపడంతో అనుమానించిన పోలీసులు ఆటోను నిలిపి తనిఖీ చేయగా బ్యాటరీలు లభించాయి. దీంతో ఇరువురిని స్టేషన్‌కు తరలించి విచారించగా వివిధ ప్రాంతాల్లో తాము చేసిన నేరాలను అంగీకరించారని ఎస్ఐ శివతేజ వివరించారు. నిందితుల నుంచి రూ.2.94లక్షల విలువైన 33బ్యాటరీలను స్వాధీనం చేసుకుని పట్టుబడిన ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ తెలిపారు.

### అటవీ భూమిలో చెలరేగిన మంటలు

**ఐదు గంటల పాటు శ్రమించి ఆర్పిన ఫైర్ సిబ్బంది**

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ సమీపంలోని అటవీభూమిలో శనివారం మధ్యాహ్నం మంటలు చెలరేగాయి. ఐదుగంటల పాటు ఫైర్ సిబ్బంది శ్రమించి మంటలను ఆర్పివేశారు. అటవీ ప్రాంతంలో దట్టంగా అలముకున్న పొగతో మంటలను ఆర్పివేయడం ఫైర్ సిబ్బందికి ఇబ్బందిగా మారింది. మంటలతో ఎండు గడ్డి, హరితహారం చెట్లు కాలిపోయాయి. సుమారు రెండు వందల ఎకరాల్లో విస్తరించిన ఈ అటవీ భూమిలో పెద్దసంఖ్యలో ఉన్న కోతులు మంటల వేడివికి పరుగులు తీశాయి. పాములు, పక్షులు, ఇతర చిన్నచిన్న జీవరాశులు మంటల్లో ప్రాణాలు కోల్పోయాయి. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో పాటు ఎండుగడ్డి ఉండడంతో మంటలు వేగంగా విస్తరించాయి. అటవీశాఖ సిబ్బంది ఇచ్చిన సమాచారంతో అగ్నిమాపక కేంద్రం నుంచి రెండు ఫైర్ ఇంజన్లు వెళ్లి ఐదు గంటల పాటు శ్రమించి మంటలను ఆర్పివేశాయి. దీంతో చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ బావులకు పెద్ద ప్రమాదం తప్పింది.

### తాళ్ల సింగారంలో...

చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తాళ్లసింగారంలోని ఇళ్ల మధ్య ఉన్న రైతు బాలగోని పరమేషకు చెందిన గడ్డివాము శనివారం దగ్ధమైంది. రూ.లక్ష విలువైన గడ్డి వాము కాలిపోయింది. ఫైర్‌సిబ్బంది వెళ్లి మంటలను ఆర్పివేశారు. సకాలంలో ఆర్పివేయడంతో చుట్టు పక్కల ఇళ్లకు పెద్దప్రమాదం తప్పిందని గ్రామస్థులు తెలిపారు.

### తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



సిద్దులుగౌడ్(ఫైల్)

రాజాపేట, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం నెమిల గ్రామానికి చెందిన కల్లు గీత కార్మికుడు పాల సిద్ధులుగౌడ్(30) తాటిచెట్టు పైనుంచి పడి శనివారం మృతి చెందాడు. సిద్ధులుగౌడ్ 12 ఏళ్లగా కల్లుగీస్తూ గీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రోజుమాదిరిగానే శనివారం కల్లు గీసేందుకు వెళ్లి తాటి చెట్టు పైకి ఎక్కుతుండగా జారి పడడంతో తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెం దాడు. ఆయన భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు.

### మనస్తాపంతో ఆత్మహత్య

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు, బంధువులు ఎవరూ లేరని యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పట్టణ ఇన్‌స్పెక్టర్ వీరరాఘవులు తెలిపిన వివరాల ప్రకారం జిల్లాకేంద్రంలోని క్రిష్ణానగర్‌లో ఓ ఇంట్లో తన సోదరుడు, సోదరితో కలిసి నివాసముంటున్న చిత్తలూరి సిద్ధు(21) శనివారం తెల్లవారుజామున ఉరివేసుకున్నాడు. సిద్ధు తల్లి దండ్రులు కొంతకాలం క్రితం మరణించారు. అయితే సిద్దు రోజు వారీగా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తనకు తల్లి దండ్రులు, బంధువులు ఎవరు లేరని మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావిస్తున్నారు. సిద్ధు సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు

### డీవైడర్‌ను ఢీకొట్టిన కారు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కారు అదుపుతప్పిన ఘటనలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం స్టేజీ వద్ద తొర్రూరు-వలిగొండ ప్రధాన రహదారిపై శనివారం జరిగింది. ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం జనగాం జిల్లాకు చెందిన బండి బీరయ్య తన కుమారులతో కలిసి ఒగ్గు కథలు చెబుతూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14 తిరుమలగిరిలో ఒగ్గు కథ చెప్పి అక్కడి నుంచి శనివారం తెల్లవారుజామున కారులో నార్కట్‌పల్లి మండలంలో మరో ఒగ్గుకథ చెప్పడానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో చౌళ్లరామారం స్టేజీ సమీపంలో కుక్క అడ్డుగా రావడంతో తప్పించబోయి కారును డివైడర్‌కు ఢీకొట్టాడు.దీంతో మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సనిమిత్తం అతడిని ప్రైవేట్‌ఆసుపత్రికి తరలించారు. తండ్రి బీరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

# పోదాం.. జన జాతరకు



- లింగమంతుల జాతరకు సర్వం సిద్ధం
- నేటి అర్ధరాత్రి నుంచి జాతర ప్రారంభం
- సుమారు 15లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- 2వేల మంది పోలీసులతో బందోబస్తు
- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల దారి మళ్లింపు



సూర్యాపేట(కలెక్టరేట్), ఫిబ్రవరి 15,(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాకేంద్రం సమీపంలోని దురాజ్‌పల్లి వద్ద గల పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర నేటి అర్ధరాత్రి నుంచి ప్రారంభం కానుంది. జాతర కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాకేంద్రంలోని గొల్లబజార్ నుంచి మకరతోరణం యాదవ కుల సాంప్రదాయాల ప్రకారం శోభాయాత్రతో పెద్దగట్టుకు చేరుకుంది. దిష్టిపూజ తర్వాత సూర్యాపేట మండలం కేసారం గ్రామంలోని మెంతబోయిన వారి కుటుంబాల ఆధ్వర్యంలో 15 రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న దేవరపెట్టె నేటి అర్ధరాత్రి పాదయాత్రగా గుట్టపైకి చేరుకుంటుంది. దీంతో జాతర ప్రారంభమవుతుంది. జాతర ప్రారంభమైన తర్వాత భక్తులు బోనాలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పించనున్నారు. గంపల ప్రదర్శన తర్వాత సౌడమ్మ అమ్మ వారికి గొర్రెలను, మేకలను బలి ఇస్తారు. తాము కోరిన కోర్కెలు తీర్చాలని వేడుకుంటారు. ప్రతి రెండు సంవత్సరాలకోసారి జాతర జరుగనుంది. ఈ నెల 16వ తేదీ అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన జాతర ఈనెల 20వ తేదీన ముగియనుంది. జాతరకు తెలంగాణ నంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తారు.ఐదు రోజులు పెద్దగుట్టపైన ఒ లింగా.. ఓలింగా.. నామస్మరణలతో ఆలయ ప్రాంతమంతా మార్మోగనుంది. జాతరకు 15 లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే అవకాశముంది. ఏర్పాట్లను కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ పర్యవేక్షిస్తున్నారు. చెరువు నిండి ఉండడంతో గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు.

### రెండు వేల మంది పోలీసులతో బందోబస్తు

జాతరలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర ప్రదేశాలను 12 సెక్టార్లుగా విభజించి 2వేల మంది పోలీసులను మూడు షిఫ్టులలో 24 గంటల పాటు బం దోబస్తు నిర్వహించే విధంగా చర్యలు చేపట్టారు. బందోబస్తులో ముగ్గురు అదనపు ఎస్పీ లు, పది మంది డీఎస్పీలు, 35మంది సీఐలు, 148 మంది ఎస్‌ఐలు, ఏఎస్‌ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు 400 మంది, కానిస్టేబుళ్లు 800 మంది, హోంగార్డులు 450మంది, మహిళ సిబ్బంది 200 మందితో పాటు షీటీం బృందాలు, మఫ్టీటీం బృందాలు, రోప్ పార్టీలు, బాంబ్, డాగ్ స్క్వాడ్, టెక్నికల్ టీంలు, సీసీఎస్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. సూర్యాపేట పోలీసులే కాకుండా నాగర్‌కర్నూల్, వనపర్తి, వికారాబాద్, నల్లగొండ, సంగారెడ్డి, జోగులాంబగద్వాల, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబాబాద్, ఖమ్మం, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి వచ్చారు.

### ఆర్టీసీ బస్సు సర్వీసులు సిద్ధం

జాతరకు హాజరయ్యే భక్తులను జాతర ప్రాంతానికి చేరవేసేందుకు ఆర్టీసీ అధికారులు బస్సులు సిద్ధం చేశారు. దురాజ్‌పల్లి జాతర సమీపంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్టాండ్ వరకు సూర్యాపేట, కోదాడ డిపోల నుంచి 75 బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచారు. సూర్యాపేట డిపో నుంచి 60బస్సులు, కోదాడ నుంచి 15 బస్సులను ప్రత్యేకంగా కేటాయించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కొత్తబస్టాండ్, పాతబస్టాం డ్, పీఎస్ఆర్ సెంటర్, ఖమ్మంక్రాస్‌రోడ్డు నుంచి ప్రయాణికులను జాతరకు చేరవేసేలా ఆర్టీసీ అధికారు లు చర్యలు చేపట్టారు.సూర్యాపేట నుంచి జాతర వరకు పెద్దలకు రూ.40, పిల్లలకు రూ.20 ఛార్జీలు వసూలు చేయనున్నారు.

### సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా

జాతరను 68 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్‌లతో సెక్యూరిటీ సర్వేలైన్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెట్టారు. జాతర వద్ద ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పోలీసులు జాతర మొత్తాన్ని పర్యవేక్షించనున్నారు. దొంగతనాలు, చైన్స్ స్నాచింగ్స్ జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నారు.

### పార్కింగ్ ప్రదేశాలు ఇవే..

సూర్యాపేట పట్టణం వైపు నుంచి వచ్చే వాహనాలను దురాజ్‌పల్లి సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్క నుంచి రాంకోటితండాకు వెళ్లే దారిలో పార్కింగ్ చేయాల్సి ఉంది. కోదాడ, మునగాల, గుంపుల వైపు నుంచి వచ్చే వాహనాలను ఖాసీంపేట రోడ్డులో పార్కింగ్ చేసే విధంగా చర్యలు చేపట్టారు. వీటితో పాటు గరిడేపల్లి, పెన్‌పహాడ్ మార్గంలో వచ్చే వాహనాలను పాత కలెక్టరేట్ సమీపంలో గల స్థలంలో, మోతె, చివ్వెంల మీదుగా వచ్చే వాహనాలను పెద్దగట్టుకు సమీపంలోని మున్యానాయక్‌తండా వద్ద పార్కింగ్ చేయాలి.

### ప్రథమ చికిత్స కేంద్రాలు

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జాతర పరిసరాల్లో ప్రత్యేక ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం ఎనిమిది మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి 24 గంటల పాటు 24 మంది వైద్యులు, 190 మంది వైద్య సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టారు. జాతర పరిసరాల్లో మూడు అంబులెన్స్‌లు అందుబాటులో ఉంచారు. జాతర పరిసరాల్లో పర్మినెంట్, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. జాతరలో మొత్తం 31 మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. వాటికి నీటి సౌకర్యం కల్పించారు.

### నీటి సౌకర్యం

నీటి ఇబ్బందులు లేకుండా మిషన్ భగీరథ ప్రధాన పైప్ లైన్ ద్వారా భక్తులకు తాగునీటిని అందిస్తున్నారు. పెద్దగట్టు కింది భాగంలో 20వేల లీటర్ల సామర్థ్యం గల నీటి ట్యాంకును ఏర్పాటు చేశారు. గుట్ట పరిసర ప్రాంతాల్లో 25చోట్ల నల్లాలు, 12 చోట్ల టబ్‌లు ఏర్పాటు చేశారు. జాతరలో వ్యాపారులు వివిధ రకాల తినుబండారాలు తయారు చేసి విక్రయిస్తుంటారు. జాతరకు వచ్చే భక్తులు వాటిని తిని ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు ఆహారంపై తనిఖీలు చేసే విధంగా ఫుడ్ కమిటీలు ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాలు తనిఖీలు చేయనున్నారు.

### జాతీయ రహదారిపై వాహనాల మళ్లింపు

జాతర సందర్భంగా జాతీయ రహదారిపై వాహనాలను దారి మళ్లిస్తున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఈ నెల 16 నుంచి 20వ తేదీ రాత్రి వరకు 65వ జాతీయ రహదారిపై దారి మళ్లిస్తారు. హైదరాబాద్ నుంచి విజయవాడకు వెళ్లే వాహనాలు నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి నుంచి నల్లగొండ మీదుగా మిర్యాలగూడెం, హుజూర్‌నగర్ నుంచి, కోదాడకు చేరుకుని అక్కడి నుంచి విజయవాడకు వెళ్లాల్సి ఉంది. అదే విధంగా విజయవాడ వైపు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కోదాడ నుంచి హుజూర్‌నగర్ మీదుగా మిర్యాలగూడెం, నల్లగొండ, నార్కెట్‌పల్లి నుంచి వెళ్లే విధంగా చర్యలు చేపట్టారు. దీంతో పాటు హైదరాబాద్ నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు సూర్యాపేట మండలం టేకుమట్ల నుండి నూతనంగా నిర్మించిన జాతీయ రహదారి నుంచి వెళ్లాల్సి ఉంటుంది.

### జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశాం



పెద్దగట్టు జాతరకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పారిశుధ్యం విషయంలో ప్రత్యేక పర్యవేక్షణ ఉంటుంది. పారిశుధ్య పనులను మూడు షిఫ్టుల్లో షిఫ్టుకు 130 మంది చొప్పున పని చేయనున్నారు. మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ ద్వారా భక్తులకు తాగునీటి వసతి కల్పిస్తున్నాం. విద్యుత్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నాం. జాతర పరిసరాల్లో మరుగుదొడ్లు, తాగునీరు సదుపాయం కల్పించాం. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఎనిమిది ప్రదేశాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశాం.
- తేజస్ నందలాల్ పవార్, జిల్లా కలెక్టర్ సూర్యాపేట.

### పటిష్ట బందోబస్తు



జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశాం. జాతర బందోబస్తులో సుమారు 2వేల మంది పోలీసులు విధులు నిర్వహించనున్నారు. భక్తులకు దర్శన సౌకర్యం కలిగిస్తూ రక్షణ కల్పిస్తాం. దొంగతనాలు నివారణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశాం. జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలు లేకుండా ఉండేందుకు జాతీయ రహదారిపై వాహనాలను దారి మళ్లిస్తున్నాం.
- సన్‌ప్రీత్‌సింగ్, జిల్లా ఎస్పీ సూర్యాపేట.

### మార్కెట్‌కు రెండు రోజులు సెలవు

భానుపురి: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు కార్మికుల కోరిక మేరకు రెండు రోజులు సెలవు ప్రకటించామని మార్కెట్ కార్యదర్శి సంతోష్‌కుమార్ శనివారం ప్రకటనలో తెలిపారు. సోమవారం, మంగళవారం రెండ్రోజులు పెద్దగట్టు జాతర పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు తెలిపారు. మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులు తీసుకురావొద్దని ఆయన సూచించారు.

## బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

కోదాడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. దుర్గాపురంలో మాజీ కౌన్సిలర్ అల్వాల్ అపర్ణ వెంకట్‌కు శనివారం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు షేక్ నయీం, మామిడి రామారావు, కందుల చంద్రశేఖర్, కర్ల సుందర్‌బాబు, ఇమ్రాన్ ఖాన్, దొంగరి శ్రీను, వెంకట నారాయణ, హరి పాల్గొన్నారు.

## పీఏసీఎస్‌ల పదవీ కాలం పొడగింపు హర్షనీయం

హుజూర్‌నగర్,కోదాడరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగించడం వల్ల రైతులకు మరింత న్యాయం జరుగుతుందని పీఏసీఎస్ చైర్మన్ జక్కుల నరేందర్ అన్నారు. శనివారం పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం ఆరు నెలల పాటు పదవీ కాలం పెంచడం వల్ల రైతులకు న్యాయం చేసేందుకు మరింత కృషి చేస్తామన్నారు. మంత్రులు ఉత్తమ్, తుమ్మల నాగేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, మల్లేశ్వరి, శ్రీను, పద్మ, శ్యాంసుందర్,కటార్ శ్రీనివాసు, నరేందర్, వెంకటేశ్వర్లు, మల్లమ్మ పాల్గొన్నారు. కోదాడ నియోజకవర్గంలో ఉన్న పీఏసీఎస్ చైర్మన్లు, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ కొండ సైదయ్య, కాపుగల్లు చైర్మన్ నంబూరి సూర్యం, ఎర్రవరం చైర్మన్ నలజాల శ్రీనివాసరావు, అనంతగిరి చైర్మన్ డేగబాబు, కోదాడ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాస్‌రెడ్డి, చిమిర్యాల చైర్మన్ కొత్త రఘుపతి, చిలుకూరు చైర్మన్ జనార్ధన్, నడిగూడెం చైర్మన్ కొల్లు రామారావు, బేతవోలు చైర్మన్ రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలి

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల పరిష్కారానికి న్యాయవాదుల సహకారం అవసరమని జూనియర్ సివిల్ జడ్జి మారుతి ప్రసాద్ అన్నారు. పట్టణంలోని బార్‌అసోసియేషన్ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. లోక్‌అదాలత్ ద్వారా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. ఉన్నత న్యాయస్థానాలు కూడా లోక్‌అదాలత్‌ను పెద్దఎత్తున నిర్వహిస్తూ కక్షిదారులకు సహాయం చేస్తుందన్నారు. న్యాయసేవా అధికార సంస్థల ద్వారా న్యాయసేవలు అందిస్తుందన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరు పరస్పరం సహకరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాలువ శ్రీనివాసు, సురేష్, యాదగిరి, నాగేశ్వరరావు, అంజయ్య, వెంకటేశ్వర్లు, శంకర్, నాగరాజు, సైదా, ఉదయ్, రవీందర్, మాధవి పాల్గొన్నారు.

## విద్య, వైద్య రంగాలను నిర్లక్ష్యం చేసిన కేంద్ర బడ్జెట్



మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విద్య, వైద్య ఉపాధి రంగాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేసిందని సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మీ, పల్లె వెంకటరెడ్డి, నాగారపు పాండు అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌ను మోదీ ప్రభుత్వం సవరించాలన్నారు. పేదలను మోసం చేసేలా మోడీ నిర్ణయాలు ఉన్నాయన్నారు. కార్పోరేట్లకు అనుకూలంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారన్నారు. పేదలకు ప్రభుత్వం ఇళ్ళు ఇవ్వాలని, రాజకీయ జోక్యం చేయవద్దన్నారు. మోడల్‌కాలనీ ఇళ్లు పేదలకు పంచాలన్నారు. సమావేశంలో వెంకటచంద్ర, త్రివేణి, జ్యోతి, హుస్సేన్, మురళి, వెంకటనారాయణ, నాగమణి, వీరమల్లు, వెంకటి, హుస్సేన్ పాల్గొన్నారు.

## ధర్మబిక్షం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, మాజీ ఎంపీ బొమ్మగాని ధర్మబిక్షంగౌడ్ జీవితాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో శనివారం జయంతి సందర్భంగా ధర్మబిక్షం చిత్రపటానికి పూలామాల వేసి నివాళులర్పించారు. ధర్మబిక్షం విద్యార్థి నాయకుడిగా, కార్మికనాయకుడిగా, మూడు సార్లు ఎమ్మెల్యే, రెండు సార్లు ఎంపీగా పని చేయడం జరిగిందన్నారు. సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు యల్లావుల రాములు, గుండు వెంకటేశ్వర్లు, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, దొరపల్లి శంకర్, దంతాల రాంబాబు, అంతయ్య, రేగటి లింగయ్య, తొగటి మురళి, మల్లికార్జునరెడ్డి, నిమ్మల ప్రభాకర్, గోపగాని రవి పాల్గొన్నారు.

## 'రామారావు సేవలు చిరస్మరణీయం'

కోదాడరూరల్, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు వక్కవంతుల రామారావు సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన రామారావు సంతాప సభ మండలంలోని తమ్మరలో శనివారం నిర్వహించారు. రామారావు విద్యాబోధనలో అనేక మంది ఉన్నతస్థితిలో కొనసాగుతున్నారన్నారు. రిటైర్డు కలెక్టర్ ముస్కుల వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ కమ్యూనిస్టు భావాలు గల రామారావు మునగాలలో చాలా కాలం ఉపాధ్యాయుడిగా పనిచేశారన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈవో ఓరుగంటి రవి, న్యాయవాదులు, రాధాకృష్ణమూర్తి, మేకల వెంకట్రావు, నాయకులు, ఎం. వెంకటేశ్వరరావు, ఉప్పల యుగందర్‌రెడ్డి, లిష్ట వెంకటరెడ్డి, బుర్రి శ్రీరాములు, జాస్తి సుబ్బారావు, పెదనాటి వెంకటేశ్వరరావు, నాగార్జున, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# నేటినుంచి చిన్నగట్టు జాతర

కోదాడరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని నల్లబండగూడెం గ్రామంలోని లింగమంతుల స్వామి చిన్నగట్టు జాతర నేటి నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నారు. జాతరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ కంచుగంటి బాబుయాదవ్ తెలిపారు. రెండు సంవత్సరాలకోసారి జరిగే జాతరకు కృష్ణా, ఖమ్మం జిల్లా నుంచి కూడా పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారు. పెద్దగట్టు జాతర విధంగా ఈ జాతరను కూడా వైభవంగా నిర్వహిస్తారు. యాదవుల ఆరాధ్యదైవం లింగమంతుల స్వామి జాతరను యాదవ కుల పెద్దలతో పాటు గ్రామస్థులు కలిసి కట్టుగా మూడు రోజులు వైభవంగా నిర్వహిస్తారు. 16వ తేదీ సాయంత్రం నల్లబండగూడెం గ్రామంలోని ప్రజలు, ప్రభబండ్ల, గంపల ఊరేగింపుతో గుట్టపైకి చేరుకుంటారు. 17న గుట్టలో స్వామి వారి అభిషేకాలు, పూజా నిర్వహిస్తున్నారు. 18న చంద్రపట్నం కార్యక్రమంతో జాతర ముగుస్తుంది. జాతర సందర్భంగా పలు సాంస్కృతి కార్యక్రమాలు, క్రీడా పోటీలు, ఎద్దుల పందాలు, నిర్వహిస్తారు. ఈ నెల 17న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి జాతరకు హాజరవుతారని ఆలయ కమిటీ చైర్మన్ బాబుయాదవ్ తెలిపారు.

### రాష్ట్రస్థాయి ఎడ్ల పందెలు ప్రారంభం

చిన్నగట్టు లింగమంతుల జాతర సందర్భంగా కోదాడ మండల పరిధిలోని నల్లబండగూడెం గ్రామంలో రాష్ట్రస్థాయి ఎడ్ల పందెలను డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, ఉపాధ్యాక్షులు ఇర్ల సీతారాంరెడ్డి, అమర్‌నాయిని వెంకటేశ్వరరావు, గంగవరపు లక్ష్మణరావు, రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి పాల్గొన్నారు. దేవాలయ కమిటీ, సభ్యులు మల్లయ్య, వీరబాబు, రామకృష్ణ, బడుగుల రమాదేవి, పెంటయ్య, మల్లికార్జున్, కుమార్, రామ్‌కోటి తదితరులు పాల్గొన్నారు.



జాతరకు ముస్తాబైన లింగమంతుల స్వామి దేవాలయం

## అద్దంకి దయాకర్ చర్చకు సిద్ధమా?

తిరుమలగిరి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ బ్రాహ్మణుడని కాంగ్రెస్ నాయకుడు అద్దంకి దయాకర్ చేసిన వాఖ్యలపై చర్చకు సిద్ధమా అని బీజేపీ తుంగతుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో శనివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అద్దంకి దయాకర్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఎవరి మెప్పుకోసమో, పదవులకోసమో, చరిత్ర తెలుసుకోకుండా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించుకేందుకే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ నాయకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ చరిత్ర కనుమరుగవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు మేకల శ్రీనివాస్‌రెడ్డి, వై. దీన్‌దయాల్, మూల వెంకట్‌రెడ్డి, కొండ సోమయ్య, మూల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి

తుంగతుర్తి, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని ఏఐకేఎంఎస్ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ డిమాండ్ చేశారు. హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 20న చేపట్టిన చలో హైదరాబాద్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటైన 14 నెలలు పూర్తవుతున్నా ఇప్పటి వరకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇల్లులేని పేదలందరికీ ఇళ్లు, నూతన రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, తడకమల్ల సంజీవ్, జలగం లక్ష్మయ్య, జి. రవీందర్, ఎం. శ్రీను, జి. సోములు, ఎస్‌కె. యూసుఫ్, భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే లక్ష్యం

సూర్యాపేటఅర్బన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానని వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవిందర్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు 010 పద్దు ద్వారా వేతనాలు, గురుకుల పాఠశాల ఉపాధ్యాయ టైటిల్‌తో పాటు నైట్ డ్యూటీ లేకుండా కృషి చేశానని తెలిపారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమమ్ టైం స్కేల్ వచ్చే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ బిల్లును క్లియర్ చేయిస్తానని, ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేసి ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ద్వార బిల్లులు మంజూరు చేయడంతో పాటు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం ఏకమల్లు, శ్రీనునాయక్, అంతటి వెంకన్న, శ్రీనివాస్, నవీన్, వీరన్న, రమేష్, శ్రీరాంనాయక్, గణేష్, మల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పూల రవీందర్

## సమాజాన్ని సంస్కరించిన వ్యక్తి సేవాలాల్



హుజూర్‌నగర్‌లో సంత్‌సేవాలాల్ జయంతిలో పాల్గొన్న గిరిజన సంఘ నాయకులు

సూర్యాపేటటౌన్, కోదాడ, తుంగతుర్తి, హుజూర్‌నగర్, గరిడేపల్లి, ఫిబ్రవరి15(ఆంధ్రజ్యోతి): సమాజాన్ని సంస్కరించిన వ్యక్తి సేవాలాల్ మహారాజ్ అని జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుధర్శన్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణమండపంలో శనివారం నిర్వహించిన సేవాలాల్ జయంతి ఉత్సవాల్లో భాగంగా గిరిజన న్యాయవాదుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోగ్‌బండార్ కార్యక్రమంలో మాట్లాడారు. గిరిజన జాతిని మేల్కొల్పడంలో సేవాలాల్ కృషి ఎనలేనిదన్నారు. తండాలు కూడా అభివృద్ధి చెందాలని కలలు కన్న సేవాలాల్ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి జరుగుతుందన్నారు. టీబీఈఎస్ఎస్ ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ జయంత వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాజారాం, డప్పుకు మల్లయ్య, బొమ్మగాని శ్రీనివాస్, మాంద్రమల్లయ్య, బానోతు సతీష్, వీరేష్, ప్రతాప్, రవిందర్, మురళి, శంకర్, దారాసింగ్‌రాథోడ్, వెంకన్ననాయక్, మక్తానాయక్, హుస్సేన్‌నాయక్, పాండు నాయక్, రవిందర్‌నాయక్, గోపినాయక్, లింగానాయక్, హరిసింగ్ నాయక్, నాగేశ్వర్‌రావు, శివ, విమలాబాయ్, మణికంఠ, నరేష్ పాల్గొన్నారు. కోదాడ పట్టణంలోని హుజూర్‌నగర్ రోడ్డులో సంత్ సేవాలాల్ 286వజయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు తదితరులు పాల్గొన్నారు. హుజూర్‌నగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ మార్కెట్ చైర్మన్ సాముల శివారెడ్డి, కోతి సంపత్‌రెడ్డి, బాణోతు జగన్‌నాయక్ పాల్గొన్నారు. తుంగతుర్తి, గరిడేపల్లి మండలాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

## సీతారామచంద్రస్వామి ఊరేగింపు

హుజూర్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఫణిగిరి గట్టుపై ఈ నెల 12 రాత్రి శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించగా చక్రతీర్థ స్నానం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శనివారం ఫణిగిరి గట్టు నుంచి దేవతామూర్తులను వివిధ వాహనాలపై అధిష్ఠింపజేసి ఊరేగింపు నిర్వహించారు. గట్టునుంచి పట్టణంలోని శ్రీవేణుగోపాల-శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయానికి వేంచేశారు. కార్యక్రమంలో ఈట కొండారెడ్డి, మురళి, భాస్కర్, మోహన కృష్ణమాచార్యులు, జగన్నాధాచార్యులు, సూర్యప్రకాశ్, అశోక్, శ్రీనివాస్, రాము, ప్రసాద్, నర్సింహాచార్యులు, కృష్ణ పాల్గొన్నారు.

## జిల్లా కమిటీ ఎన్నిక

సూర్యాపేటటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఇరిగేషన్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్(టీఐఎన్‌జీవో) జిల్లా నూతన కార్యవర్గాన్ని శనివారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘ కార్యాలయాంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె. జానిమియా, దున్నాశ్యాంలు ప్రకటించారు. అధ్యక్షుడిగా భూపతి వెంకటయ్య, ఉపాధ్యక్షులుగా కె. బలరాం, ఎండీ. జానీమియా, ఎస్.ఎల్‌రాజు, పి. రజిత, సెక్రెటరీగా ఎన్. రవి, జాయింట్ సెక్రెటరీలుగా ప్రసాద్, పి. రంజిత్‌కుమార్, ఎస్‌కె. ఇమ్రాన్, రాములమ్మ, ట్రెజరీగా ఎస్. నవీన్, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా సీహెచ్. శ్రీధర్, జి. రాకేష్‌కుమార్, బి. ప్రతాప్, జానకి, పబ్లిక్ సెక్రెటరీగా శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు.

## ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య జాతర

పెన్‌పహాడ్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీదేళ్ళ గ్రామంలో కొనసాగుతున్న శ్రీలక్ష్మీతిరుపతమ్మ గోపయ్య జాతర సందర్భంగా శనివారం మెట్ల శిరాం ఆధ్వర్యంలో మహాఅన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ పరెడ్డి సీతారాంరెడ్డి, ఆలయ చైర్మన్ మోదుగు నర్సిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక అబివృద్ది సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ప్రభబండ్లతో భారీ ర్యాలీ నిర్వహించి స్వాగతం పలికారు.

## నక్కలపల్లిలో శివస్వాముల పడిపూజ

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లిలో శనివారం శివస్వాములు మహా పడిపూజను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతీ రామలింగేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ఉత్సవంలో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, టీపీసీసీ నాయకుడు దైద రవీందర్, మాజీ సర్పంచ్ ఈద మాధవినర్సింహ, కనుకుల అంజయ్య, కరుణాకర్‌రెడ్డి, వెంకన్న, గ్రామస్థులు పాల్గొన్నారు.

## సహకార సంఘాల పదవీకాలం పొడగింపుపై హర్షం

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల పదవీకాలాన్ని మరో 6 మాసాలు పొడగించడంపై చిట్యాల మండలం వెలిమినేడు పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సహకార సంఘాల పదవీకాలం ఈ నెల 15వ తేదీన ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సంఘాల అభ్యున్నతిని కాంక్షిస్తూ మరో ఆరు మాసాలు పొడగించడం శుభపరిణామమని అన్నారు. అందుకు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు నాగేశ్వరరావు, వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశానికి కృతజ్ఞతలు తెలిపారు.

## నైపుణ్యాభివృద్ధి శిక్షణకు రఘునందన్ ఎంపిక

మర్రిగూడ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణ, సవాళ్లు అనే అంశంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరాన్ని భారత ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ శిక్షణకు పౌరసరఫరాల శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ ఎంపికయ్యారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో రెండు రోజులుగా ప్రారంభమైన రెండు రోజుల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ శాఖలకు చెందిన పౌరసరఫరాల శాఖ అధికారులను సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీలను శిక్షణకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

## ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో జరిగే బీసీ కులాల సమావేశానికి హాజరయ్యేందుకు శనివారం బయలుదేరిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. కవితక్క నాయకత్వం వర్థిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు కొండూరు శంకరయ్య, దుబ్బాక శ్రీధర్, రేగట్టె మహేందర్‌రెడ్డి, ఎండీ.వాజిద్, సాయి, చిక్కుల్ల లింగయ్య, టీజీ లింగం గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పేదోళ్ల ఫ్రిజ్‌లు వచ్చేశాయి



» వేసవి రావడంతో పెరిగిన విక్రయాలు
» మట్టి కుండలో నీరు ఆరోగ్యానికి మేలు

నల్లగొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మట్టి కుండలు అనాదిగా వాడుకలో ఉన్నాయి. అల్యూమినియం, స్టీల్, ఇతర పాత్రలు వాడుకలోకి రావడంతో మట్టి కుండలకు ఆదరణ క్రమక్రమంగా తగ్గింది. ఆధునిక వంట పాత్రల వాడకం ద్వారా రోగాలు ప్రజలను చు ట్టుముడుతున్నాయనే భావనతో మరల ప్రజలు మట్టికుండల వైపు మళ్లుతున్నట్లు చర్చ సాగుతోంది. చాలా చోట్ల వంటలకు, తాగునీటికి మట్టి కుండలవైపు మొగ్గు చూపుతున్నారు. వేసవిలో మట్టి కుండలో నీళ్లు తాగడానికే ఎక్కువగా ప్రజలు ఇష్టపడుతున్న పరిస్థితులు ఉన్నాయి. ఫ్రిజ్‌లు అధిక శాతం మందికి ఉన్నా ఫ్రిజ్ నీరు తాగితే అనారోగ్యం బారిన పడుతామని కుండనీటిని ఆశ్రయిస్తున్నారు. కుండ నీరు వేసవితాపాన్ని తీర్చడంతో పాటు శరీరానికి ఉపశమనం కలిగిస్తాయని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండ తీవ్రత పెరగడంతో ప్రజలు కుండలను, కూజాలను, పాత్రలను ఆశ్రయిస్తున్నారు. చలివేంద్రా ల్లో సైతం అత్యధికంగా మట్టికుండలనే పెడుతారు. ఈ కుండల్లో నీరు తాగితే దాహం తీరడంతో అల్కలిన్ లక్షణాలు, నీటి పీహెచ్ స్థాయిలను సమతుల్యం చేస్తాయని పలువురు పేర్కొంటున్నారు.

### కుండ నీరు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠం

కుండ నీరు ఆరోగ్యానికి ఎంతో శ్రేష్ఠమని చెప్పవచ్చు. ఈ నీరు తాగడం వల్ల కడుపులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆరోగ్యాన్ని కల్పిస్తాయి. అదేవిధంగా ఖనిజాలు, లవణాలు కూడా అందుతాయి. మట్టి కుండల వల్ల కూడ అనేక ప్రయోజనాలు ఉన్నాయని చెప్పవచ్చు. జిల్లా కేంద్రంలోని పలు కూడళ్లల్లో పెద్ద ఎత్తున మట్టి కుండలను విక్రయిస్తున్నారు. జిల్లాలో నలుమూలల నుంచి వచ్చిన వారంతా నల్లగొండ పట్టణంలో కుండలను, కూజాలను, మట్టి పాత్రలను కొనుగోలు చేసి తీసుకెళ్తారు. ఇటీవల తిరుమల తిరుపతి దేవస్థానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లల్లో పెరుగు కోసం ప్రత్యేకంగా తయారుచేసిన మట్టిపాత్రలను రూ.100కు కొనుగోలు చేసిన మహిళలు మట్టి పాత్రలలో పెరుగు ఎంతో నాణ్యత ఉంటుందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఉక్కపోతతో పాటు ఎండలు మండుతుండటంతో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మట్టి కుండలు అంటేనే చల్లదనానికి మారుపేరు అని చెప్పవచ్చు. ప్రస్తుతం పెద్ద కుండలు రూ.120 నుంచి రూ.200 వరకు కూడా విక్రయిస్తున్నారు. అదేవిధంగా మట్టికుండల్లో పలు రకాలుగా ఉన్నాయి. వీటిని మూడు రకాలుగా విభజించవచ్చు. ఇందులో మట్టి, పింగాణి పాత్రలుగా పరిగణిస్తారు. మట్టిపాత్రలను చేతితో తయారు చేసి తక్కువ ఉష్ణోగ్రతలతో కాల్చుతారు.

### మట్టి పాత్రలో పెరుగుతో ఆరోగ్యం



జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో పెరుగు కోసం మట్టి పాత్రను కొనుగోలు చేశాను. ఆ పాత్రలో పాలు తోడు పెడితే పెరుగు ఎంతో రుచితో పాటు ఆరోగ్యం లభిస్తుంది. అదే విధంగా కుండలో నీటిని కూడా ప్రతీ ఎండ కాలం తాగుతుంటాం. కుండల నీరు పిల్లలకు, పెద్దలకు ఎంతో మంచింది. ఫ్రిజ్‌లో అతిచల్లగా ఉన్న నీరు తాగితే ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం తాము ఎక్కువగా మట్టిపాత్రనే వాడుతున్నాం.

- షబానా బేగం, నల్లగొండ

### కుండల నీటితో ఎంతో ప్రయోజనం



తాము ప్రతీరోజు కుండలో నీటిని తాగడానికి ఇష్టపడతాం. వేసవికాలం వచ్చిదంటే ఫ్రిజ్ నీరు తాగకుండా కుండలో నీరు తాగడానికి మొగ్గు చూపుతాం. ఈ నీరు ఆరోగ్యానికి కూడా ఎంతో మంచింది. ఫ్రిజ్‌లో నీరు అధికంగా చల్లగా ఉండటం వల్ల అనారోగ్యం బారినపడతారు. డాక్టర్లు కూడా అధికంగా చల్లగా ఉన్న నీరు తాగవద్దని సూచించిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రతి ఒక్కరూ కుండలో నీరును తాగుతున్నారు.

- ఎం.రేవతి, అలివేలుమంగాపురం కాలనీ, నల్లగొండ

## ఎస్‌ఎఫ్‌ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శుల నియామకం

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ఎస్‌ఎఫ్‌ఐ నల్లగొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులుగా సైఫ్, కిరణ్ ఎన్నికయ్యారు. పట్టణంలోని సుందరయ్య భవనంలో శనివారం జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఏ సైఫ్, మారుపాక కిరణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## ఉదయసముద్రంలో జంతు కళేబరం!

● మూడు రోజులుగా నీటిలోనే...

నల్లగొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మృతి చెందిన కోళ్లను వేసిన ఘటన మరిచిపోక ముందే జిల్లా కేంద్రంలోని ఉదయ సముద్రం ప్రాజెక్టులో జంతు కళేబరం ఉండటం ప్రజలకు ఆందోళన గురిచేస్తోంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మూడు రోజులుగా తూము వద్ద జంతు కళేబరం కనిపిస్తుందని, అయినా ఎవరూ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి వచ్చే తాగునీటితో పాటు ఉమ్మడి జిల్లాలోని సుమారు 650 గ్రామాలకు ఉదయసముద్రం ప్రాజెక్టులో ఉండే కృష్ణాజలాలు సరఫరా చేస్తుంటారు. వేసవి కావడంతో సంబంధిత జంతువుకు దాహం వేసి నీటి తాగడానికి చేసిన ప్రయత్నంలోనే జారిపడి చనిపోయినట్లు సమాచారం.

## రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు



రేషన్ దుకాణాన్ని పరిశీలిస్తున్న విజిలెన్స్ సీఐ గౌస్

మర్రిగూడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రేషన్‌డీలర్లు బియ్యం పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని నల్లగొండ విజిలెన్స్ సీఐ గౌస్ హెచ్చ రించారు. మండలకేంద్రంలోని నెంబర్ వన్ రేషన్ దుకాణాన్ని శనివారం ఆయన తనిఖీ చేసి బియ్యం బస్తాలను పరిశీలించి, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్లు లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేయకుండా వారే కొనుగోలు చేసి విక్రయిస్తూ దొరికితే దొరికినట్లయితే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులు బియ్యాన్ని అమ్ముతామని వచ్చినా డీలర్లు వాటిని తీసుకోవద్దని అన్నారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ నర్సింహారెడ్డి, రేషన్ డీలర్ ఉన్నారు.

## సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి




సమావేశానికి హాజరైన రైతులతో జగాల్‌రెడ్డి

కనగల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయ సాగును ప్రోత్సహించాలని రైతు నాయకుడు గోలి జగాల్‌రెడ్డి అన్నారు. బెంగుళూరు పట్టణంలో శనివారం జరిగిన సమావేశంలో జిల్లా తరపున పాల్గొని మాట్లాడారు. నేటి ఆధునిక వ్యవసాయ సాగులో విచ్చలవిడిగా వాడుతున్న క్రిమిసంహారక మందులతో పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతుందన్నారు. నేల, నీరు, గాలి కలుషితమై జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. అదే విధంగా ఆహార పదార్థాల కల్తీ మనుషులపై దుష్ఫలితాలను కలిగిస్తుందన్నారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. ఆదిశగా ప్రభుత్వాలు చట్టాలు చేసి వాటిని అమలుచేయాలన్నారు. ప్రజ లు పర్యావరణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మొక్కలను విరివిగా నాటి పచ్చదనం పెంచాలన్నారు.

## 'హామీలను వెంటనే అమలుచేయాలి'



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సాగర్, వెంకటేశ్వర్లు

శాలిగౌరారం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలుచేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి సాగర్, ఏఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జ్వాల వెంకటేశ్వర్లు, జిల్లా నాయకుడు వేముల శంకర్ డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 20న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై 14 నెలలు పూర్తవుతున్నా ఇప్పటివరకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను, హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. వెంటనే ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు, నూతన రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమం లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు పోలేపాక ఎల్లయ్య, యానాల సత్తిరెడ్డి, పి.ఇజ్రాయిల్, డి.రాజు, వెంకట్‌రెడ్డి, సుధాకర్, మధు తదితరులు పాల్గొన్నారు.

## సేవలందించిన నాయకుడిని ప్రజలు మరువరు

చిట్యాలరూరల్, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసిన నాయకులను గుర్తుంచుకుంటారని డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసిరెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లికి చెందిన దివంగత కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శిశెట్టి గౌరయ్య వర్ధంతి కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. పార్టీని ప్రజలను నమ్ముకున్న వారికి ఏనాటికైనా ఆదరణ లభిస్తుందని అన్నారు. కార్యక్రమంలో నమ్ముల విజయ్‌కుమార్‌గౌడ్, బత్తుల మల్లేష్‌గౌడ్, పంతంగి రంగారావు, బండ లింగస్వామి, దుబ్బ పద్మకుమారస్వామి, జవాజి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు నాణ్యమైన భోజనం అందించాలి



కేజీబీవీ పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు

కట్టంగూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో జ్ఞాన ప్రకాష్ రావు అన్నారు. మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో నీలాంబరి, ఉపాధ్యాయులు ఉన్నారు.

# ధర్మభిక్షం జీవితం ఆదర్శనీయం

● సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

మునుగోడు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ ఎంపీ బొమ్మగోని ధర్మ భిక్షం జీవితం ఆదర్శప్రాయమని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. శనివారం ధర్మభిక్షం జయంతిని పురస్కరించుకొని సీపీఐ ఆధ్వర్యంలో మునుగోడు బస్టాండ్ ఆవరణలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ ధర్మానికి కట్టుబడి నమ్మిన సిద్ధాంతాన్ని నమ్ముకొని కడవరకు ఉద్యమ పోరాటాలు నిర్వహించిన ధర్మ భిక్షం సేవలను కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు సురిగి చలపతి, గిరిజ రామచంద్రం, చాపల శ్రీను, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, యాదయ్య, సత్యనారాయణ, సత్యం, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



నల్లగొండలో ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

### ధర్మభిక్షం జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నల్లగొండటౌన్: స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు బొమ్మగాని ధర్మభిక్షంగౌడ్ జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు అయితగోని జనార్దన్‌గౌడ్ పిలుపునిచ్చారు. బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఆయనకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడిగా, ఎమ్మెల్యేగా, ఎంపీగా, ఆయన సమాజానికి చేసిన సేవలు వెలకట్టలేనివన్నారు. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో పాల్గొని విద్యార్థులందరినీ ఏకం చేసి ధర్మభిక్షం జీవిత చరిత్రని పాఠ్యాంశంలో చేర్పించి భావితరాలకు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార సమితి జిల్లా అధ్యక్షుడ కర్నాటి యాదగిరి, బీసీ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారింగు నరేష్‌గౌడ్, బీసీ యువజన సంఘం నాయకులు రావుల రాజేష్‌గౌడ్, శివకోటేష్ గౌడ్, నిరంజన్, నాగచారి, మనోజ్, చింటు, శీనుగౌడ్, శివశంకర్‌గౌడ్, గోపి పాల్గొన్నారు.

● మర్రిగూడలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరకల నిరంజన్ గౌడ్ ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎంపీ ధర్మభిక్షం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో మండల కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్, ఆకుల రఘుమయ్య, ఎరకల యాదయ్య, ఆకుల వెంకట్రాం, కర్నాటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



మునుగోడులో ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నెల్లికంటి సత్యం

● చిట్యాలలో మాజీ ఎంపీ, సీపీఐ నేత ధర్మభిక్షం జయంతిని సీపీఐ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రవణ్‌కుమార్, గీత పనివారల సంఘం జిల్లా కార్యదర్శి బొడిగె సైదులు, మండల కార్యదర్శి అక్బర్, పట్టణ కార్యదర్శి షరీఫ్, నాయకులు కూనూరు అంజయ్య, పొన్నం లక్ష్మయ్య, వెంకన్న పాల్గొన్నారు.

● నల్లగొండ రూరల్: నల్లగొండ పట్టణంలోని మగ్దూం భవనంలో ధర్మభిక్షం చిత్రపటానికి సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి లొడంగి శ్రావణ్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గీత పనివారల సంఘం జిల్లా అధ్యక్షుడు పబ్బు వీరస్వామి, నాయకులు వి.లెనిన్, జి.పండరి, అక్కలయ్య, కోటేష్ దుర్గయ్య, సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ...

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని సాందీప్ హైస్కూల్లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా పాత్రలను పోషించారు. ఆర్‌జేడీగా పి.దీప, కలెక్టర్‌గా పి.లావణ్య, డీఈవోగా బి.రితిక, ఎంఈవోగా టి.జయ ప్రసన్న, కరస్పాండెంట్‌గా టి.వర్షిణి, ప్రిన్సిపాల్‌గా రిత్విక్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్స్ ఎండీ. ఆమన్ అలీ, కృష్ణచైతన్య ఒక్కరోజు బాధ్యతలను చక్కగా నిర్వహించి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సాందీప్ పాఠశాల వ్యవస్థాపకుడు గానూతుల సత్యనారాయణరెడ్డి విద్యార్థులను అభినందించి బహుమతులను అందజేశారు.



సాందీప్‌స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం




శాస్త్ర స్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

### శస్త్ర స్కూల్‌లో...

పట్టణంలోని శస్త్ర స్కూల్‌లో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులు ఆకట్టుకున్నారు. డీఈవోగా వర్ష, విద్యాశాఖమంత్రిగా వసంత, కలెక్టర్‌గా గోదావర్షిని, కరస్పాండెంట్‌గా సాయి తేజ, ప్రిన్సిపాల్‌గా వినిత్, ఎమ్మెల్యేగా విశ్వన్, ఉత్తమ ఉపాధ్యాయులిగా మేడి సాక్షి వ్యవహరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అండ్ చైర్మన్ లింగయ్య విద్యార్థులను అభినందించారు.

## విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి : మంత్రి




విద్యార్థినిని అభినందిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా కష్టపడి చదివి ఉన్నతస్థాయికి చదువుకోవాలని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. నల్లగొండలోని ఎంవీఆర్ పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు తాను ఎల్లవేళలా అండగా ఉంటానని, ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా ఎంతోమంది పేద విద్యార్థుల చదువుకు ఆర్థికంగా సహాయం చేస్తూ చేయూతనందిస్తున్నాన్నారు. తనకు ఏ పదవి లేకపోయినా పేదలకు, పేద విద్యార్థులకు సేవ చేస్తానని అన్నారు. నిరుద్యోగ యువత కోసం నల్లగొండలో స్కిల్ డెవలప్‌మెంట్‌కు భవనాన్ని శంకుస్థాపన చేశామని, దానిని త్వరలోనే ప్రారంభించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఎంజీయూ, బీ వెల్లెంల ప్రాజెక్టును పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.80 కోట్లతో యూనివర్సిటీలో అభివృద్ధి పనులు, సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా బీవెల్లెంల ప్రాజెక్టును ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, పాఠశాల కరస్పాండెంట్ కొలనుపాక గీత రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేతేపల్లి, కట్టంగూరు ఓటర్ల జాబితా విడుదల

కేతేపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాల పరిధిలో ఇటీవల అధికారులు విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో పురుష ఓటర్ల కంటే మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారు. మండలంలోని 11ఎంపీటీసీ స్థానాల పరిధిలో 16గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో మొత్తం ఓటర్లు 31,261మంది ఉండగా వారిలో 15,218 మంది పురుష ఓటర్లు, 16,042మంది మహిళా ఓటర్లు ఉండగా ఒక్కరు థర్డ్ జండర్ ఉన్నారు. మొత్తం 16 గ్రామ పంచాయతీలకు ఉప్పలపహాడ్, ఇప్పలగూడెం, తుంగతుర్తి గ్రామాలు మినహా మిగిలిన 13గ్రామాల్లో 824మంది మహిళలు అధికంగా ఉన్నాయి.

● కట్టంగూరు మండలంలో 13 ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు 2025 ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితాను ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 13ఎంపీటీసీ స్థానాలకు గాను 63పోలింగ్ స్టేషన్లను గుర్తించినట్లు తెలిపారు. మండలంలో మొత్తం 37,639 మంది ఓటర్లు ఉండగా అందులో 18,671 మంది పురుష ఓటర్లు, 18,968 మంది మహిళా ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో చింతమల్ల చలపతి, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

● మర్రిగూడ మండలంలోని 18 గ్రామపంచాయతీలకు గాను ఎంపీటీసీ, జడ్పీటీసీ పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీవో మున్నయ్య ఎంపీడీవో కార్యాలయంలో ప్రదర్శించారు. మొత్తం 58 పోలింగ్ కేంద్రాలకు గాను 7 పోలింగ్ కేంద్రాలు గట్టుప్పల్ మండలంలో చేర్చినట్లు ఆయన తెలిపారు. గట్టుప్పల్ మండలంలో నామాపురం, అంతంపేట గ్రామాల ఎంపీటీసీ స్థానాలు వెళ్లినందున 7 పోలింగ్ కేంద్రాలను తొలగించినట్లు తెలిపారు.

## 'టీచర్లకు ముందు 'టీఆర్' ను చేర్చాలి'

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వైద్యవృత్తి చేస్తున్న వైద్యుల పేర్లకు ముందు డాక్టర్ (డీఆర్) అని చేర్చినట్టుగానే టీచర్ వృత్తిలో ఉన్న వారికి కూడా 'టీఆర్' అని చేర్చాలని ట్రస్మా రాష్ట్ర సలహాదారుడు కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. టీఆర్ ఇవ్వడం ఉపాధ్యాయులకు ఇచ్చే గౌరవంగా భావించాలని సూచించారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషిస్తున్నారనడంలో సందేహం లేదన్నారు. డాక్టర్, జస్టిస్, మిలటరీ కెప్టెన్, మేజర్‌లకు వారి పేర్ల ముందు అవి గౌరవసూచకంగా ఉంటున్నపుడు ఉపాధ్యాయుల పే ర్ల ముందు టీఆర్ చేర్చడం సముచితమేనని ఆయన పేర్కొన్నారు.

## 'వ్యక్తిగత పంచాయితీలను రాజకీయలకు ఆపాదించవద్దు'



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కొరిమి ఓంకారం


చండూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పంచాయితీలను రాజకీయలకు ఆ పాదించడం కేవలం బీఆర్‌ఎస్‌కు తగదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మునిసిపల్ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్ చండూరు పట్టణానికి చెందిన ఓ వ్యాపారిని బెదిరించి భయభ్రాంతులకు గురి చేస్తే, సదరు వ్యక్తి తమను కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. బాధితుడికి అండగా ఉండాల్సి ఉండగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆదేశాలతోనే శేఖర్‌పై అక్రమ కేసులు పెట్టారని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆ యన ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ నేతలు అమాయక ప్రజలపై దాడులు చేస్తే చూస్తూ ఊరుకోవాలా అని నిలదీశారు. తీరును మార్చుకోకపోతే కోమటిరెడ్డి బ్రదర్స్ అభిమానుల నుంచి తీవ్ర పరిణామాలుంటాయని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మండల మాజీ అధ్యక్షుడు సుజావుద్దీన్, మాజీ సర్పంచ్ భూతరాజు ఆంజనేయులు, నాయకులు కడారి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షలతోనే దళిత నేతపై కేసులు



విలేకరులతో మాట్లాడుతున్న అన్నెపర్తి యాదగిరి

చండూరు, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్షలతోనే రాష్ట్రంలో దళిత నేతలపై అక్రమ కేసులు మోపుతున్నారని బీజేపీ దళిత మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నెపర్తి యాదగిరి ఆరోపించారు. చండూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చండూరు మునిసిపల్ కౌన్సిలర్ అన్నెపర్తి శేఖర్‌పై పోలీసులు అక్రమ కేసులు బనాయించారని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అరాచకాలను ప్రశ్నిస్తూ వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు దళితులపై ఇలాంటి దాడులు, అరెస్టులు చేపిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని తిరగబడుతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ అన్నెపర్తి సంతోష, దుబ్బ గణేష్, అన్నెపర్తి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | : 18004251442 |
| యాదాద్రి | : 1800 425 7106 |
| సూర్యాపేట | : 1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 60

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.135 | 200 | 225 |
| సూర్యాపేట | రూ.130 | 200 | 210 |
| నల్లగొండ | రూ.125 | 195 | 210 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.5 । కనిష్ఠం 20.0

# పోదాం.. జన జాతరకు..







విద్యుత్ వెలుగుల్లో పెద్దగట్టు ఆలయం

- నేటి అర్ధరాత్రి నుంచి జాతర ప్రారంభం
- సుమారు 15లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా
- 2వేల మంది పోలీసులతో బందోబస్తు
- ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల దారి మళ్లింపు



సూర్యాపేట నుంచి మకరతోరణాన్ని గట్టుపైకి తరలిస్తున్న యాదవులు


సూర్యాపేట జిల్లా దురాజ్‌పల్లి పెద్దగట్టు లింగమంతుల స్వామి జాతర ఆదివారం అర్ధరాత్రి ప్రారంభం కానుంది. జాతరకు సుమారు 15లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేయగా, అందుకు తగినట్టు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గొల్లబజార్ నుంచి మకరతోరణాన్ని యాదవ కుల సంప్రదాయాల ప్రకారం శోభాయాత్రగా పెద్దగట్టుకు చేర్చారు. దిష్టిపూజ తర్వాత కేసారం గ్రామంలోని మెంతబోయిన కుటుంబాల ఆధ్వర్యంలో 15 రోజులుగా ప్రత్యేక పూజలు అందుకున్న దేవరపెట్టె ఆదివారం అర్ధరాత్రి గుట్టపైకి చేరుకుంటుంది. దీంతో జాతర ప్రారంభమవుతుంది. జాతర ప్రారంభమైన తర్వాత భక్తులు బోనాలు వండి స్వామివారికి నైవేద్యం సమర్పిస్తారు. గంపల ప్రదర్శన తర్వాత సౌడమ్మ అమ్మవారికి తల్లి గొర్రెను, పిల్ల గొర్రెను బలిచ్చి బలిచల్లుతారు. జాతర సందర్భంగా 2వేల మంది పోలీసులతో భద్రత ఏర్పాటుచేస్తున్నారు. - (ఆంధ్రజ్యోతి, సూర్యాపేట కలెక్టరేట్)

•7లో..

# స్వర్ణ విమానగోపురానికి మహాకుంభాభిషేకం



- 23న మహాక్రతువు
- 19 నుంచి ప్రారంభంకానున్న ప్రత్యేక పూజలు
- 108మంది రుత్వికులు, రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో కార్యక్రమాలు



దివ్య విమాన గోపురానికి తొలగనున్న ముసుగు

తెలంగాణ తిరుపతిగా పేరొందిన యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో స్వర్ణ విమాన గోపురానికి మహాకుంభ సంప్రోక్షణకు ముహూర్తం ఖరారైంది. దేశంలోనే మొట్టమొదటి ఎత్తయిన స్వర్ణ గోపురం సంప్రోక్షణా కార్యక్రమాలు ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 50.5అడుగుల ఎత్తుతో ఉండే దివ్య విమాన పంచతల గోపురానికి



సిద్ధమైన యాగశాల

సుమారు 68.84కిలోల బంగారంతో తాపడం చేశారు. ఈ నెల 23న ఉదయం 11.54గంటలకు మూలా నక్షత్రయుక్త వృషభ లగ్న పుష్కరంశ సుముహూర్తాన సుదర్శన లక్ష్మీ నారసింహ దివ్య స్వర్ణ విమాన గోపుర మహాకుంభాభిషేక ప్రతిష్ఠామహోత్సవం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలను వానమామలై మఠం పీఠాధిపతి రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో 108 మంది రుత్వికులు, ఆలయ అర్చకులు నిర్వహించనున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతితో ప్రొటోకాల్ ప్రకారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఇతర మంత్రులను ఈ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నట్టు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. ఇదిలా ఉండగా, మహాకుంభాభిషేకం సందర్భంగా ఆలయంలో ఆర్జిత సేవలు రద్దు చేశారు. ఈ నెల 19 నుంచి 23 వరకు సుదర్శన హోమాలతోపాటు, 23న హోమం, సువర్ణ పుష్పార్చన, నిత్యకల్యాణోత్సవాలు రద్దు చేశారు. సహస్ర నామార్చనలు, అభిషేకాలు యథావిధిగా కొనసాగనున్నాయి.

•6లో..

## డీఎస్సీ 2008 అభ్యర్థులకు పోస్టింగ్‌లు

**జిల్లాలో 75 మందికి ఆర్డర్‌లు ఇచ్చిన విద్యాశాఖ**

**సోమవారం విధుల్లో చేరాలని ఆదేశాలు**

నల్లగొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో డీఎస్సీ 2008 అభ్యర్థులకు శనివారం కాంట్రాక్ట్ పద్ధతిన పోస్టింగ్ ఇచ్చారు. మొత్తం 75 మందికి జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి ఆర్డర్‌లను అభ్యర్థులకు అందించారు. సోమవారం వారంతా విధుల్లో చేరాలని ఆదేశాలిచ్చారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఎస్సీ 2008 అభ్యర్థులకు పోస్టింగ్‌లు కల్పించారు. కౌన్సిలింగ్ ద్వారా పోస్టులను భర్తీ చేశారు. వివరాల్లోకి వెళితే డీఎస్సీలో ఎంపిక విధానాన్ని మార్చడంతో తమకు అన్యాయం జరిగిందని ఎస్జీటీగా రావాల్సిన ఉద్యోగాలు రాలేదంటూ డీఎస్సీ 2008 అభ్యర్థులు గతంలో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుదీర్ఘ కాలం తర్వాత సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంతోపాటు తాత్కాలిక ఉద్యోగులుగా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో జిల్లాలో 75మంది అర్హత కలిగిన అభ్యర్థులకు అవకాశం కల్పించారు. వీరికి కనీస వేతనం రూ.31,040గా ప్రభుత్వం నిర్ణయించింది. అదేవిధంగా వీరికి కాంట్రాక్ట్ ఉద్యోగుల మాదిరిగానే సెలవులు ఇవ్వనున్నారు. శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో 2008 డీఎస్సీ అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు పరిశీలించారు. అనంతరం నోటిఫైడ్ చేసిన ఖాళీల్లో అభ్యర్థులు ర్యాంకుల ఆధారంగా పోస్టింగ్ ఆర్డర్‌లు జారీ చేశారు.

## రేవంత్‌ది అబద్ధాల ప్రభుత్వం

- అసత్యాలతోనే పరిపాలన
- జాబ్ క్యాలెండర్ ఎటు పోయింది
- కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి


నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం మీద పదేళ్లకు వ్యతిరేకత వస్తే ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ పాలన మీద ఏడాదికే వ్యతిరేకత మొదలైందని కేంద్ర పర్యాటక మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తం రెడ్డి గెలుపు కోరుతూ శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతరం అబద్ధాలతోనే రేవంత్ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని, అందుకే ఏడాదిలోపే ప్రజల్లో అపఖ్యాతి మూటగట్టుకున్నారన్నారు. కుల గణన సర్వేతో బీసీలకు అన్యాయం జరిగిందని, తాము ప్రశ్నిస్తే, దానికి సమాధానం చెప్పకుండా మోదీ కులం ప్రస్తావన తీసుకురావడం ఏమిటని నిలదీశారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ పేరుతో ఇచ్చిన హామీని ఇంకా అమలు చేయలేదన్నారు. తేదీలవారీగా ఏ రోజు ఏ గ్రూప్ పరీక్షలు నిర్వహిస్తాం అని జాబ్ క్యాలెండర్ విడుదల చేసి సంవత్సరం పూర్తవుతుందని, జాబ్ క్యాలెండర్ ఎటు పోయిందని నిలదీశారు. నిరుద్యోగులను రేవంత్ నట్టేట ముంచారని మండిపడ్డారు. సమావేశంలో వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి, గొంగిడి మనోహర్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, కంకణాల శ్రీధర్‌రెడ్డి, కంకణాల నివేదిత, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, గోలి మధుసూధన్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్‌గౌడ్, పిల్లిరామరాజు, కన్మంతరెడ్డి శ్రీదేవి, నీరజ, రావెళ్ళ కాశమ్మ, తారాసింగ్ పాల్గొన్నారు.

## మహిళా దొంగల ముఠా అరెస్ట్

•6లో..

## ఏపీ నుంచి వచ్చే కోళ్ల వాహనాలు వెనక్కి






## ఎవరూ అపోహలకు గురికావొద్దు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పెద్దఅడిశర్లపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మృతి చెందిన కోళ్ల కళేబరాల ఘటన పట్ల ప్రజలు ఎవరూ అపోహలకు గురికావద్దని నల్లగొండ కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. శనివారం ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, జలమండలి, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, వెటర్నరీ అధికారులతో కలిసి అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో మృతిచెందిన కోళ్లను వేశారని సమాచారం వచ్చిన వెంటనే జలమండలి, పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, వెటర్నరీ తరఫున సమగ్ర విచారణ జరిపామన్నారు. తమ విచారణలో రిజర్వాయర్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో నివసిస్తున్న పౌల్ట్రీ యజమాని చనిపోయిన 45 కోళ్లను లింక్ కెనాల్‌లో విసిరి వేశారని, ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఏఎస్పీ మౌనిక అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారని చెప్పారు. ఆమె వెంట ఏఎస్పీ మౌనిక, ఆర్డీవో రమణారెడ్డి, ఇరిగేషన్ డీఈ నాగయ్య, వెటర్నరీ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ఎంపీడీవో చంద్రమౌళి, పలువురు అధికారులు ఉన్నారు.

## గంజాయి రహిత జిల్లాగా నిర్మిస్తాం

**ఎస్పీ శరత్ చంద్ర పవార్**



ప్రథమ బహుమతిని అందజేస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్

నల్లగొండ క్రైం, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): గంజాయి రహిత జిల్లాగా నల్లగొండను నిర్మిస్తామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన యువతేజం జిల్లాస్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ఎస్పీ హాజరై గెలుపొందిన జట్లకు షీల్డులు, నగదు బహుమతులను అందజేసి మాట్లాడారు. జిల్లాలో డ్రగ్స్ నిర్మూలనే ధ్యేయంగా మిషన్ పరివర్తన్ రూపొందించి ఎంతో మంది యువతలో మార్పు తెచ్చామని, గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో యువతేజం కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వచ్చే ఏడాది కూడా ఈ పోటీలు నిర్వహిస్తామని, ఈ పోటీలలో ఖచ్చితంగా పోలీస్ టీమ్ ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుంచే కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. జిల్లా స్థాయిలో విజేతగా నిలిచిన మిర్యాలగూడ సబ్ డివిజన్ జట్టుకు షీల్డుతోపాటు రూ.25వేల నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన నల్లగొండ సబ్ డివిజన్(శాలిగౌరారం) జట్టుకు షీల్డుతో పాటు రూ. 15వేలు, తృతీయ స్థానంలో నిలిచిన దేవరకొండ డివిజన్‌కు షీల్డు రూ.10వేల నగదును అందజేశారు. అదే విధంగా బెస్ట్ ఆల్‌రౌండర్‌గా సాయికిరణ్(మిర్యాలగూడ), బెస్ట్ రైడర్ శివ( దేవరకొండ), బెస్ట్ డిఫెండర్‌గా వినయ్(మిర్యాలగూడ) నిలిచారు. జిల్లాస్థాయి పోటీలు రసవత్తరంగా హోరాహోరీగా సాగాయి. కార్యక్రమంలో డీఎస్పీలు కొలను శివరాంరెడ్డి, విఠల్‌రెడ్డి, రమేష్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటం



దేవరకొండ సీపీఐ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతున్న పల్లా నర్సింహారెడ్డి

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి**

దేవరకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి సీపీఐ ప్రజలపక్షాన నిరంతరం పోరాటాలు చేస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి అన్నారు. శనివారం దేవరకొండ సీపీఐ భవన్‌లో జరిగిన దేవరకొండ మండల కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అన్ని గ్రామాలు తిరిగి సీపీఐ నాయకులు, కార్యకర్తలు కొత్త శాఖలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల బరిలో నిలిచేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంకావాలన్నారు. ఈ నెల 20 నుంచి జరగనున్న సీపీఐ గ్రామశాఖ మహాసభలను విజయవంతం చేయాలన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు వలమాల ఆంజనేయులు, వెంకట్రాములు, షైనొద్దిన్, యాదయ్య, జ్యోతిబసు, కందుకూరు శ్రీను పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి మిర్యాలగూడ ***
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● ఆదివారం 16 ఫిబ్రవరి 2025

## నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయకునితండాలో ముత్యాలమ్మ తల్లి జాతర ఈనెల 16 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ప్రభుదాస్, రంగా ప్రభ, బాల, బాలచందర్ శనివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 19న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేలు (సీనియర్) నిర్వహించనున్నట్లు తెలిపారు.

## సర్వే బాధ్యతగా నిర్వహించాలి : ఎంపీడీవో

చింతపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): బీసీ కులగణన సర్వేలో ఎన్యూమరేటర్లు బాధ్యతాయుతంగా నిర్వహించాలని ఎంపీడీవో సుజాత సూచించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం ఎన్యూమరేటర్లకు సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీసీ కులగణనలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా కుటుంబ సర్వే చేపట్టి వివరాలను పొందుపర్చాలని ఆమె సూచించారు.

## కమ్మేసిన నిర్లక్ష్యం



కొండమల్లేపల్లి మండలకేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో డబుల్ బెడ్ రూం ఇళ్లకు వెళ్లే దారిలో విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు, కంపచెట్ల నడుమ ప్రమాదకరంగా మారింది. చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు దట్టంగా పెరగడంతో ట్రాన్స్‌ఫార్మర్ కనిపించని పరిస్థితి నెల కొంది. అధికారులు స్పందించి కంపచెట్లు తొలగించి రక్షణ వలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-కొండమల్లేపల్లి)

# గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్

● ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు ● మిర్యాలగూడ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వీరేశం, మందుల సామేలు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): గిరిజనుల ఆరాధ్యదైవం సంతుసేవాలాల్ మహారాజ్ అని మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం సేవాలాల్ 286వ జయంతి సందర్భంగా నిర్వహించిన భోగ్ బండార్ నకిరేకల్, తుంగతుర్తి ఎమ్మెల్యేలు వేముల వీరేశం, మందుల సామేలు కలిసి పాల్గొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా సేవాలాల్ భవన్ వరకు సేవాలాల్ విగ్రహాన్ని రథంపై నుంచి ఊరేగించారు. బంజారాలు సంప్రదాయ దుస్తులతో నృత్యాలు చేస్తూ ర్యాలీ నిర్వహించి మహ భోగ్ బండార్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హింస పాపమని, మత్తు, ధూమపానం శాపమని సేవలాల్ తలచారని అన్నారు. సేవాలాల్ జయంతి వేడుకలు ప్రభుత్వం అదనంగా రూ.కోటి మంజూరు చేసిందన్నారు. ఎమ్మెల్యేలు వీరేశం, సామేలు మాట్లాడుతూ సీఎంఎం రేవంత్‌రెడ్డి సేవాలాల్ జయంతి రోజు సెలవుదినంగా ప్రకటించి ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాన్ని నిర్వహించి గిరిజనుల పట్ల ప్రేమను చాటుకుంటోందన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ నారాయణ అమిత్, తహసీల్దార్లు హరిబాబు, జవహర్, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, ఎమ్మెల్సీ అభ్యర్థి పూల రవీందర్, గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు స్కైలాబ్‌నాయక్, మాజీ ఎంపీపీలు నందిని, బాలు నాయక్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రతన్‌సింగ్‌నాయక్, కాంగ్రెస్ నాయ కులు పగిడి రామలింగయ్య, రవినాయక్, సిద్దూనాయక్, దశరథ నాయక్,లింగానాయక్, కృష్ణ కాంత్,మాన్యానాయక్, నాగునాయక్, మంగ్యానాయక్ త పాల్గొన్నారు.

### గిరిజనులకు కాంగ్రెస్ చేసిందేమీలేదు

● మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

గిరిజనులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా స్థానిక బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ గిరిజన నేతలతో కలిసి సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో రూ. కోటితో సేవాలాల్ భవన్ నిర్మిం చిన ఘనతకూడా బీఆర్ఎస్ ప్రభుత్వందేనని అన్నారు. కార్యక్రమంలో చిట్టిబాబు నాయక్, ఆంగోతు హతీరాం, సేవ్యానాయక్, బాణావత్ లలిత, శంకర్‌నాయక్, వినోద్ నాయక్, షోయబ్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

### స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

దేవరకొండ : స్థానిక స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో అధ్యక్షుడు ఎన్‌వీటీ మొక్కలను నాటా రు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు గాజుల ఆంజనేయులు, అసోసియేషన్ సభ్యులు కృష్ణకిషోర్, నాగరాజు, కృష్ణ, రాజు, హరికృష్ణ పాల్గొన్నారు.

### ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలో ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యంలో సేవాలల్ జయంతిని నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్థానిక చౌర స్తా వద్ద సేవా లాల్ మహారాజ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా బయల్దేరి మల్లెలగట్టు వరకు వెళ్లి బంజార భవన్ దగ్గర భోగ్ బండారు కార్యక్ర మాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జమునామాధవరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, నాయకులు ఉట్కూరి వేమన్‌రెడ్డి, బక్కులు, బూడిద మల్లేష్‌యాదవ్, బంజారా మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ వార్డు సభ్యులు, నాయకులు, బావోజీ పాల్గొన్నారు.

● చింతపల్లి : మండలంలోని ధైన్యాతండాల్లో ఆంజనేయస్వామి ఆలయ వద్ద సంతు సేవాలాల్ చిత్రపటానికి పూల మాల వేసి ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు రమావత్ శ్రీనివాస్ నాయక్, హరినాయక్, మోత్యా, నగేష్, ధర్మానాయక్, జగన్, తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడ భోగ్‌బండార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, మందుల సామేలు, డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్



మిర్యాలగూడ: బీఆర్‌ఎస్ కార్యాలయంలో సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు



కొండమల్లేపల్లిలో సేవాలాల్ మహారాజ్ వేడుకల్లో పాల్గొన్న ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం నాయకులు

## జాతరలు సంప్రదాయానికి ప్రతీక

● ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ● మారేపల్లిలో ఎండ్ల పందేలు ప్రారంభం

హాలియా, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జాతరలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకల అని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. అనుముల మండలం మారేపల్లి గ్రామంలో లక్ష్మీ సమేతవేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా నిర్వహించిన ఎండ్లపందేలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మనిషి అధ్యాత్మికతతోనే క్రమశిక్షణగా నిబద్ధతతో పని చేయడానికి దోహదపడతాయన్నారు. అంతకు ముందు ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజ నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వా హకులు ఎంసీ కోటిరెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ న్యాయవాది అంజాద్‌ఖాన్, గ్రామస్థులు అనుముల యాదయ్య, మారేపల్లి క్రాంతి, మెండే ఏడుకొండలు, రుద్రాక్షి భిక్షపతి, గండె యాదయ్య, దేవాలయ చైర్మన్ గడిదే శ్రీను, భీమానాయక్, గండె వెంకటయ్య, నక్క దుర్గాశంకర్, అయితరాజు నాగరాజు, గణపతి వెంకన్న, రామగిరి మల్లేష్, విజం మూరి సురేష్, గండికోట గిరి, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్యసేవలు అందించాలి: ఎమ్మెల్యే బీఎల్ఆర్

మిర్యాలగూడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్‌లో ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి వైద్యులను కోరారు. వేడి బూడిద మీదపడి గాయపడి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను శనివారం ఆయన పరామర్శించారు. వైద్య సేవలు అందుతున్న తీరుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం బీహెచ్‌ఈఎల్ ఉన్నతాధికారులకు, పవర్‌మెక్ కాంట్రాక్టర్ సత్యనారాయణకు ఫోన్ చేసి గాయపడిన కార్మికులకు కావల్సిన వైద్యసేవలను దగ్గరుండి పర్యవేక్షించాలని కోరారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురు కార్మికులు కోలుకుని తిరిగి ఇంటికి చేరేవరకు అన్ని సదుపాయాలను అందించాలని ఆదేశించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను కలిసి ఇబ్బంది కలుగకుండా చూసుకుంటానని ధైర్యం చెప్పారు.

### పెరిగిన వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలి

మున్సిపల్ కార్మికులకు పెరిగిన వేతన బకాయిలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా నాయకులు తిరుపతి రాంమూర్తి కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం మున్సిపల్ కార్మికులు ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. 2021లో గత ప్రభుత్వ కార్మికుల వేతనం పెంచిందని అన్నారు. అప్పటి నుంచి 2023 జూన్ వరకు పెంచిన వేతనం ఇవ్వలేదని అన్నారు. కార్మికులకు సబ్బులు, దుస్తులు, టవల్స్, కొబ్బరినూనె, చెప్పులు, బూట్లు , గ్లౌజులు అందించాలని కోరారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వెంకన్న, మోహన్‌నాయక్, అబ్రహం, కళావతి, వెంకన్న, లింగయ్య పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి



హాలియా : సమావేశంలో పాల్గొన్న నాయకులు

హాలియా, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలు పరిష్కరించే వరకు నిరంతరం పోరాటాలు నిర్వహిస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆవుతా సైదులు, ఎస్ఎఫ్ఐ సాగర్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్ అన్నారు. హాలియాలో శనివారం నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో వారు మాట్లాడారు. విద్యార్థులకు అందాల్సిన స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండాప్రభుత్వం విద్యా ర్థుల జీవితాలతో చెలగాటమాడుతుందన్నారు. ఈనెల 19, 20 తేదీలలో నల్లగొ ండలో నిర్వహించనున్న 45వ మహాసభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. అనంతరం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు, బూడిగపాక వర్షిత్ తదితరులను ఎన్నుకున్నారు.

● కొండమల్లేపల్లి : ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్‌నాయక్ పిలుపునిచ్చారు. కొండమల్లేపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మహాసభల పోస్టర్‌ను యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసచారి ఆవిష్కరించారు. కార్యక్రమంలోనాయకులు బి. వెంకటేష్, జై చరణ్, సురేష్, రాము, దాసు, మల్లేష్, రాజు, పావని, మంజుల, రోజా, నందిని పాల్గొన్నారు.

## బాలికల గురుకులంలో ఆకతాయి హల్‌చల్ ?

● నిద్రిస్తున్న విద్యార్థిని లెగిన్ కత్తిరించినట్లు ప్రచారం

దేవరకొండ, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దేవరకొండ పెంచికల్‌పహాడ్ గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో ఓ ఆకతాయి హల్‌చల్ చేసినట్టు సమాచారం. ఈ విషయం ఆలస్యంగా శనివారం రాత్రి వెలుగుచూసింది. బాలికలు శుక్రవారం తెల్లవారు జామున నిద్రిస్తున్న సమయంలో ఆకతాయి హాస్టల్ గోడ దూకి లోపలికి చొరబడి విద్యార్థిని లెగిన్ కత్తిరించినట్లు తెలిసింది. అయితే అదే సమయంలో నిద్ర నుంచి లేచిన బాలికలు కేకలు వేయడంతో పారిపోయినట్లు సమాచారం. శనివారం ప్రిన్సిపాల్ కల్యాణి సెలవులో ఉండగా, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ విధుల్లో ఉన్నారు. ఆకతాయిలు ప్రవేశించారని తల్లిదండ్రులకు విద్యార్థినులు సమాచారం ఇవ్వడంతో తల్లిదండ్రులు శనివారం రాత్రి హాస్టల్ వద్దకు చేరుకొని తమ పిల్లలను ఇంటికి తీసుకెళ్లారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో బయటికి రావడంతో దేవరకొండ సీఐ నర్సింహులు తన సిబ్బందితో పాఠశాలకు చేరుకొని సీసీ ఫుటేజీని పరిశీలించారు. పాఠశాలలోకి ఆకతాయిలు ఎవరూ ప్రవేశించలేదని, బాలికలే ఒకరినొకరు లెగిన్ కత్తిరించుకున్నట్లు అనుమానం ఉందని తెలిపారు. ఆకతాయి పాఠశాలకు ప్రవేశించినట్లు ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ తెలిపారు. కాగా పాఠశాలలో ఇంటర్ ప్రవేశానికి నేడు (ఆదివారం) ఎంట్రెన్స్ పరీక్ష ఉండడంతో ఎవరిని అనుమతించడం లేదు.

## ధర్మభిక్షం ఆశయ సాధనకు కృషి చేయాలి

దేవరకొండ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):మాజీ ఎంపీ దివంగత బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో మండలం తాటికోలు, పట్టణ ంలోని సీపీఐ కార్యాల యంలో శనివారం వేర్వేరుగాగా ధర్మభిక్షం జయంతి వేడుకలను నిర్వహించారు. తాటికోలులో ధర్మభిక్షం విగ్రహానికి పలువురు గౌడ సంఘం నేతలు పూల మాలవేసి నివాళులర్పించారు. కార్యక్ర మంలో బీసీ సంఘం నాయకులు ఇరగదిండ్ల కృష్ణ, జూలూరు ఎల్లయ్య, కేశవులు, రాఘవచారి పాల్గొన్నారు.

● మిర్యాలగూడటౌన్ : బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ ధర్మభిక్షం చిత్రపటానికి పూలమాల వేసి నివా ళుల ర్పించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బం టు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విజయ్, వెంకటేష్, నరేష్, రాంబాబు, అంజి తదితరులు పాల్గొన్నారు.



దేవరకొండ మండలం తాటికోలులో ధర్మభిక్షం విగ్రహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, గౌడ సంఘం నేతలు

## ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో చెత్త తొలగింపు



మండల పరిషత్ కార్యాలయంలో చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి):మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్తను సిబ్బంది శనివారం తొలగించారు. ఈనెల 15న ఆంధ్ర జ్యోతిలో 'పట్టించుకునే వారేరీ' అనే శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో అస్తవ్యస్తంగా పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే విధంగా చర్యలు చేపట్టారు. మునిసిపల్ సిబ్బంది కార్యాలయ ప్రాంగణంలోని చెత్తను శనివారం ట్రాక్టర్ల ద్వారా తరలించి కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. దీంతో కార్యాలయానికి వచ్చిన పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## సరాయే మీరాలం మసీదు స్వాధీనం

మిర్యాలగూడ, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): సరాయే మీరాలం మసీదును వక్ఫ్‌బోర్డును అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు వక్ఫ్‌బోర్డు టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ మహ్మద్ ఆసీఫ్ అలీఖాన్ చెప్పారు. స్థానిక పెద్దబజార్‌లోని మసీ దును శనిఆరం స్వాధీనం చేసుకున్న అనంతరం ఆయన మాట్లాడారు. మసీదు కమిటీ పదవీకాలం పూర్తి కావడంతో పాటు 35 ఏళ్లుగా ఒకే కమిటీ మసీదును నిర్వహిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పరిశీలనకు వచ్చి ప్రస్తుత కమిటీకి సమా చారం ఇచ్చినప్పటికీ ఎలాంటి స్పందన లేదన్నారు. మసీదుతో పాటు దుకాణ సముదాయాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నోటీసులు అంటించామని తెలి పారు. త్వరలోనే మసీదు కమిటీ ఎన్నికలు నిర్వహణకు ఏర్పాట్లు చేస్తామన్నారు. ఇకపై రంజాన్‌తో పాటు షాపింగ్ కాంప్లెక్స్ నిర్వహణను వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ మహ్మమద్ అలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఆయన వెంట వక్ఫ్‌బోర్డు ఈవో సయ్యద్, ఇబ్రహీం, ముస్లిం మత పెద్దలు ఉన్నారు.



మసీదుకు నోటీసు అంటిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

## సాయిబాబా ఆలయంలో పూజలు

చింతపల్లి, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): మం డల కేంద్రంలోని షిర్డీసాయిబాబా ఆల యం లో మాజీ జడ్పీటీసీ సభ్యులు కంకణాల ప్రవీ ణావెంకట్‌రెడ్డి కుటుంబ సమేతంగా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ.. హిందు ధర్మ పరిరక్షణ కోసం ట్రస్టు చైర్మన్ సభ్యులు గోవులను పెంచడం అభినందనీయమన్నారు. కార్య క్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్ రెడ్డి, వింజమూరి రవి, బాదేపల్లి నిరంజన్‌గౌడ్, కృష్ణ, గడ్డం శేఖర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



చింతపల్లి సాయినాథుని ఆలయంలో మాజీ జడ్పీటీసీ ప్రవీణావెంకట్ రెడ్డి దంపతులకు సన్మానం

# విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ

నిడమనూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలంలోని ఊట్కూరు ప్రాథమిక పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. విద్యార్థులే ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. పిల్లలకు పాఠాలు బోధించారు. వివిధ పాత్రలతో ప్రతిభ చాటుకున్న విద్యార్థులను పలువురు అభినందించి వారికి బహుమతులు అందించారు. అనంతరం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ సైదులు, బొమ్ము ఉపేందర్, శంకరాచారి, స్వాతి, వెంకటేశ్వర్లు, వెంకన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

● మాడ్గులపల్లి :మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈవో వెంకటమ్మ పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఊరికి, పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, వినోద, నాగేశ్వ ర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రా ములు, శోభారాణి, ఇస్మాయిల్, భాగ్యవతి, విద్యా ర్థులు పాల్గొన్నారు.

● పెద్దఅడిశర్లపల్లి : గుడిపల్లి జడ్పీ హైస్కూల్‌లో స్వపరిపాలన దినోత్సవం శనివారం నిర్వహించారు. సహచర విద్యార్థులకు పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో సముద్రాల శ్రీన య్య, ఇన్‌చార్జి హెచ్ఎం సీహెచ్ వెంకటయ్య, లక్ష్మీనర్సయ్య, జ్యోతి, పద్మ, శ్రీవిద్య, సైదులు, నరేంద్రమ్మ, హరిలక్ష్మీ, సునీత పీడీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాడ్గులపల్లి: జడ్పీ ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఎంఈవో వెంకటమ్మ, విద్యార్థులు ఉపాధ్యాయులు.



నిడమనూరు : ఊట్కూరులో పరిపాలన దినోత్సవంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



పెద్ద అడిశర్లపల్లి :విద్యార్థులు, ఉపాధ్యాయులతో పాఠశాల సిబ్బంది